

రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త

## అనంతగిరిలో దారి దోపిడీ..

### -పర్యాటకులపై రెచ్చిపోయిన దోపిడి దొంగలు

**వికారాబాద్, ఆగస్టు 01, ప్రభాతవార్త :** అనంతగిరి అందాలు చూసేందుకు వచ్చిన పర్యాటకులపై దారి దోపిడి దొంగలు రెచ్చిపోయారు. పర్యాటకులను బెదిరించి వారి వద్ద ఉన్న సెల్ ఫోను, బంగారు ఆభరణాలను దోచుకెళ్ళారు. ఈ సంఘటనకు సంబంధించి సీఐ టి.శ్రీను తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జూలై 31న అనంతగిరి అందాలు వీక్షించేందుకు హైదరాబాద్ నగరానికి చెందిన మనీష, భర్త ఆనంద్, కుమార్తెతో కలిసి కారులో వికారాబాద్ అనంతగిరి ప్రాంతంలోని ఎబ్బనూరు చెరువు వైపు వచ్చారు. అనంతగిరి అందాలను వీక్షిస్తుండగా, గుర్తు తెలియని ఇద్దరు యువకులు బైక్‌పై వచ్చి కత్తి చూపించి వారి వద్ద ఉన్న విలువైన వస్తువులు ఇవ్వాలని బెదిరించారు. దీంతో వారు భయపడి వారి వద్ద ఉన్న సెల్ ఫోను, బంగారు ఉంగరం, బంగారు గొలుసు దోపిడి దొంగలు ఇచ్చారు. దీంతో దోపిడి దొంగలు అక్కడి నుంచి పరారయ్యారు. ఈ విషయమై వికారాబాద్ పోలీస్‌స్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేశారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

# ముంచెత్తిన వాన

- దర్గాలోకి ప్రవేశించిన వరదనీరు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న నిర్వాహకులు, భక్తులు
- వెంటనే మాస్టర్‌ప్లాన్ అమలు చేయాలంటూ నివేదన



జహంగీర్‌పీర్ దర్గాలోకి చేరిన వర్షపు నీరు



జహంగీర్‌పీర్ దర్గాలోకి చేరిన వర్షపు నీరు

**కొత్తూర్, ఆగస్టు 1, ప్రభాతవార్త :**
కొత్తూర్ మండలంలోని ఇన్ముల్‌నర్వ జహంగీర్ పీర్ దర్గాలో సోమవారం కురిసిన వర్షానికి దర్గా మొత్తం జలమయంగా మారిపోయింది. దీంతో దర్గా సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీంతోనైన వెంటనే మాస్టర్ అమలు చేయాలంటూ నిర్వాహకులు ఆవేధన వ్యక్తం తెలిపారు. 50ఎకరాల్లో 50కోట్లతో హజ్రత్ సయ్యద్ జహంగీర్‌పీర్ దర్గాను అభివృద్ధి చేస్తున్నట్టు గతంలో ప్రభుత్వం ప్రకటించింది. అయితే మాస్టర్ ప్లాన్ పనులు చేపట్టడానికి అధికారులు కసరత్తులు చేస్తున్నారు. ప్రస్తుతం అభివృద్ధి పనులు అమలు కాకపోవడంతో ప్రస్తుతం జహంగీర్‌పీర్ దర్గాలో నిర్వాహకులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భక్తులతో కోట్ల రూపాయల రాబడి ఈదర్గాకు ఉన్నప్పటికి వక్ఫ్‌బోర్డు పూర్తిగా నిర్లక్ష్యం చేస్తుందని విమర్శలు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం జహంగీర్ దర్గాను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయడానికి సిద్ధంగా ఉంది. అయితే అధికారుల నిర్లక్ష్యంతో చాలా వరకు ఇక్కడ అభివృద్ధి పనులు జరగలేదని విమర్శ బయలుదేరింది. తాజాగా సోమవారం కురిసిన భారీ వర్షానికి జహంగీర్‌పీర్ దర్గాలోకి నీరు ప్రవేశించింది. వరద నీటి రాకతో దర్గా సిబ్బంది నిర్వాహకులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దర్శనం కోసం వచ్చిన భక్తులు కూడా అనేక పాట్లు పడ్డారు. నీరు ఎత్తుప ల్లాల నుండి దర్గాలోకి చేరడంతో మొత్తం చెరువులు తలపించేలా నీళ్లు చేరాయి. దర్గాలోకి నీరు పెద్ద ఎత్తున్న రావడంతో స్థానికులు ఆవేధన చెందుతున్నారు. దర్గాలోకి వచ్చిన వరదనీటిని బయటికి పంపించేందుకు దర్గా సిబ్బంది ఇబ్బందులుపడ్డారు. జహంగీర్‌పీర్ దర్గాలో నిర్వహించిన న్యాజ్‌కు వక్ ఫ్ బోర్డు చైర్మెన్ ఎండీ మసిఉ ల్లాఖాన్, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పోరేషన్ చైర్మెన్ ఇంతియాజ్‌తో కలిసి హోంమంత్రి హాజరయ్యారు. దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దర్గా అభివృద్ధి కోసం సీఎం కేసీఆర్ 50ఎకరాల స్థలం, రూ.50కోట్లను మంజూరు చేశారని హోంమంత్రి తెలిపారు. దీని కోసం మాస్టర్‌ప్లాన్ సిద్ధం చేశామన్నారు. అంతకుముందు సీఎం కేసీఆర్ సైతం దర్గా అభివృద్ధికి హామీ ఇచ్చారు. అయితే పనులు చేపట్టడంలో కొంత జాప్యం జరుగుతుండడంతో ఇలాంటి పరిస్థితులు ఎదురవుతున్నాయని స్థానికులు మీడియాకు తెలిపారు.

### కురిసిన వర్షానికి పొంగుతున్న వాగులు, కుంటలు

#### -పత్తి రైతులకు తీవ్ర నష్టం

**కోట్‌పల్లి, ఆగస్టు 1 ప్రభాతవార్త;** సోమవారం నాడు కుర్షిన వర్షానికి మండలంతో పాటు బార్వాద్,మోత్కుపల్లి, కరీంపూర్, జిన్నారం, ఎన్నారం, బీరోల్, రాంపూర్,తదితర గ్రామాలల్లో ఏడా తేరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షానికి వాగులు, కుంటలు, పొంగిపోర్లిపోతున్నాయి. బంట్వారం మండల కేంద్రంతో పాటు నూర్లపూర్, వాగు పొంగి పోర్లాయి. దీంతో ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చుట్టు పక్కన ఉన్న గ్రామ సమీపన ఉన్న వాగులు పూర్తిగా నేలమట్టంఉండటంతో వర్షాం పడితే చాలా వాగు రావాల్సిందే దీంతో ప్రయాణీకులకు సైతం గంటల కోద్ది వాగు వేల్సేదాక అక్కడే ఉండాల్సిన పరిస్థితి నెలకోంటుందని పలువురుప్రజలు అవేదన వ్యక్తం చేస్తున్నారు. వాగులకు బిడ్జి ఏర్పాటు చేస్తేగాని ఇబ్బందులు తప్పడం లేదు. అధికారులు, ప్రజా ప్రతినిధులు సైతం పట్టించుకునే నాదుడే కారువయ్యారు. గత సంవత్సరం కంటే ఈసారి భారీ వర్షాలు పడుతుండటంతో పంట పోల్లాల్లో వేసుకున్న పత్తి పంటలు పూర్తి దెబ్బతిందని రైతులు అవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈసారి అయిన పంటలు పమృద్ధిగా పండుతాయని అశ పడ్డ రైతులకు కన్నీరు మిగిల్చిందని రైతులు అవేదన వ్యక్తం చేస్తున్నారు.భారీ వర్షాలతో పంట పోల్లాలో నీరు నీల్చిడంతో. దీంతో పత్తి పంట ఎర్ర తేగులు వచ్చి పంట పూర్తిగా దెబ్బతింటుందని రైతులు వాపోతున్నారు. గత ఏడాది కిందట వర్షాలు సరిగా లేక పంటలు సరిగా పండలేదని ఈసారి అయిన పంటలు మంచిగా పండుతాయని అశ పడ్డ రైతున్నలకు తీవ్ర నిరశే మిగిలిందని పలువురు రైతులు పేర్కొం టున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వర్షానికి నష్టపోయిన రైతన్నలను అదుకోవాలని పలువురు మండల రైతులు, కోరుతున్నా రు.ఇప్పటికైన అధికారులు ప్రజా ప్రతినిధులు చోరువ తీసుకోని వాగులకు బిడ్జి ఏర్పాటు చేయాలని పలు గ్రామస్థులు ప్రజలు కోరుతున్నారు.



వర్షానికి మోత్కుపల్లి గ్రామంలో పోంగిపోర్లిపోతున్న వాగు,



కోట్‌పల్లి మండల కేంద్రంలో వర్షం పడటంతో పంట పోల్లాలో వర్షాపు నీరు,

## బిజెపి వైపు పైలెట్ నరేష్

### -ఆహ్వానించిన ఇన్చార్జ్ తరుణ్‌చుగ్
### -తాండూరు 'మహారాజ్'ల కుటుంబంలో మళ్లీ చీలిక



తరుణ్‌చుగ్‌ను కలిసిన నరేష్ పైలెట్.

**ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** దివంగత మాజీ మంత్రి చందూమహారాజ్ తనయుడు పైలెట్ నరేష్ బీజేపీలో చేరనున్నారు. ఆదివారం పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్చార్జ్ తరుణ్‌చుగ్‌ను కలిసి తాండూరు రాజకీయాలపై చర్చించారు. కర్నాటక బీజేపీ నేతల పిలుపు మేరకు నరేష్ మోడీ నాయకత్వం వైపు మొగ్గు చూపారు. త్వరలో బీజేపీలో చేరుతున్నట్లు ఆయన ప్రకటించారు. 2014 ఎన్నికల్లో టీడీపీ-బీజేపీ ఉమ్మడి అభ్యర్థిగా తాండూరు నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓడిపోయిన నరేష్ 2018 ఎన్నికల్లో తన బాబాయ్, మాజీ ఎమ్మెల్యే ఎం.నారాయణరావు వెంట టీఆర్ఎస్‌లో చేరారు. అయితే, టీఆర్ఎస్ అభ్యర్థి మహేందర్‌రెడ్డి ఓడిపోవడం, కాంగ్రెస్ నుంచి గెలుపొందిన పైలెట్ రోహిత్‌రెడ్డి టీఆర్ఎస్‌లో చేరడంతో ఆయన ఎటూ తేల్చుకోలేకపోయారు. 1962 నుంచి తాండూరు రాజకీయాల్లో కీలకపాత్ర పోషించిన ఎం.మాణిక్‌రావు, ఎం.చంద్రశేఖర్, ఎం.నారాయణరావు వారసుడైన నరేష్ గతంలో కర్నాటక రాష్ట్రం సేడెం నుంచి కూడా రెండుసార్లు ఎమ్మెల్యేగా పోటీ చేసి స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయారు. పెద్దనాన్న ఎం.మాణిక్‌రావు వరసగా మూడుసార్లు తాండూరు ఎమ్మెల్యేగా గెలుపొంది 14 ఏండ్ల పాటు కేబినేట్ మంత్రిగా కొనసాగారు. ఒక దఫా మాణిక్‌రావు ఏకగ్రీవంగా ఎమ్మెల్యేగా ఎన్నికైనారు. 1985, 1989లో నరేష్ తండ్రి ఎం.చంద్రశేఖర్ (చందూమహారాజ్) ఎమ్మెల్యేగా గెలుపొంది బీసీ సంక్షేమశాఖ, మత్స్యశాఖ మంత్రి పదవులు చేపట్టారు. 1993లో మంత్రి హోదాలో ఆదిలాబాద్ పర్యటనకు వెళుతూ చందూమహారాజ్ గుండెపోటుతో చనిపోయారు. తర్వాత తాండూరు రాజకీయాల్లో చాలా మార్పులు జరిగాయి. 2004లో చందూ మహారాజ్ సోదరుడు ఎం.నారాయణరావు ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2009లో మాణిక్‌రావు తనయుడు ఎం.రమేష్ కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసి ఓటమి చెందారు. చాలా రోజులుగా మహారాజుల ఫ్యామిలీకి విజయావకాశాలు దక్కడం లేదు. వారి స్వయంకృతాపరాధం వల్లనే ఓటమి చెందుతున్నారని ప్రజలు అంటున్నారు. ఈ క్రమంలో నరేష్ తన రాజకీయ భవితవ్యం కోసం బీజేపీలో చేరుతున్నారు. 60 వేల పైచిలుకు బీసీ ఓటర్లు ఉన్న తాండూరులో బలమైన ముదిరాజ్ సామాజికవర్గానికి చెందిన పైలెట్ నరేష్ బీజేపీ నుంచి పోటీ చేసేందుకు తహతహలాడుతున్నారు. అయితే, ఇప్పటికే టిక్కెట్ తనకే దక్కుతుందని భావిస్తున్న యు.రమేష్‌కుమార్ ఏ విధంగా స్పందిస్తారో వేచి చూడాల్సిందే.

## మన ఊరు-మన ప్రణాళికలో అవకతవకలు.?

### -నిధుల దుర్వినియోగంపై ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన బిజెపి

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 1, ప్రభాతవార్త :** కీసర గ్రామపంచాయతీ పరిధిలో 2019-2020 సంవత్సరంలో హరితహారం, మన ఊరు-మన ప్రణాళిక కార్యక్రమంలో చేపట్టిన 30రోజుల పనులలో అవతవకలు, నిధులు దుర్వినియోగం విషయంపై సంబంధిత అధికారులు కూడ రిపోర్టు చేసినా నిధుల విచారణ విషయంపై ఇంత వరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవటంపై అంతర్యం ఏమిటని కీసర గ్రామ బిజెపి అధ్యక్షులు బండారి శ్రీనివాస్‌రెడ్డి కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. సోమవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులను, ఫిర్యాదులను జిల్లా అదనపు కలెక్టర్ జాన్ శ్యాంసన్ స్వీకరించటం జరిగింది. అయితే కీసర గ్రామపంచాయతీ పరిధిలో మన ఊరు-మన ప్రణాళికలో పనుల అవతవకలు, నిధుల దుర్వినియోగం విషయంపై చర్యలు తీసుకోవాలని ప్రజావాణి ద్వారా జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై కీసర ఎంపిడిఓకు 14సెప్టెంబరు2020న ఈ విషయంపై ఫిర్యాదు చేశామన్నారు. దీంతో ఈ ఫిర్యాదుపై ఎంపిఓ విచారణ జరిపి అవతవకలు, నిధులు ప్రజాధనం దుర్వినియోగం జరిగినట్లు రిపోర్టు కూడ చేశారని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎంపిఓ రిపోర్టు 2డిసెంబరు 2020న ఈ విషయంపై డిపిఓకు ఫిర్యాదు చేసినట్లు అయినా ఇప్పటి వరకు కూడ ఎలాంటి చర్యలు తీసుకోకపోవటం పట్ల అనుమానం వ్యక్తం అవుతుందని, ఇకనైనా ఈ నిధుల విషయంపై పదవుల్లో ఉన్న వారిపై తగు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌కు చేసిన ఫిర్యాదులో కీసర గ్రామ బిజెపి అధ్యక్షులు బండారి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.

## ఆమనగల్లు మున్సిపాలిటీకి టియుఎఫ్ఐడిసి నుండి 15కోట్లు మంజూరు

### -ట్యాంక్‌బండ్, పార్కులు, లైటింగ్, కెనాల్, సిసి రోడ్లకు కేటాయింపు
### -వివరాలు వెల్లడించిన ఎమ్మెల్యే గుర్కా జైపాల్‌యాదవ్

**ఆమనగల్లు, ఆగస్టు1, ప్రభాతవార్త:** మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.15కోట్ల నిధులు మంజూరైనట్లు కల్వకుర్తి ఎమ్మెల్యే గుర్కా జైపాల్‌యాదవ్ అన్నారు. తెలంగాణ అర్బన్ ఫైనన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ లిమిటెడ్ నుండి నిధులు మంజూరయ్యాయని ఆయన పేర్కొన్నారు. విడుదలైన నిధులతో ఆమనగల్లు మున్సిపాలిటీలో మౌలిక వసతులు కల్పిస్తామని ఆయన వివరించారు. సోమవారం సాయంత్రం ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఛాంబర్‌లో ఎమ్మెల్యే గుర్కా జైపాల్‌యాదవ్ స్థానిక జడ్పిటిసి అనురాధపత్యనాయక్, వైస్ ఎంపిపి జక్కు అనంతరెడ్డి, పిఏసిఎస్ చైర్మన్ గంప వెంకటేశ్‌గుప్త, మార్కెట్ కమిటీ చైర్మన్ నాలాపురం శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ తోట గిరియాదవ్‌లతో కలిసి స్థానిక విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆమనగల్లు మున్సిపాలిటీని అన్ని విధాలుగా అభివృద్ధి పరిచి నియోజకవర్గంలో ఆమనగల్లుకు పూర్వ వైభవం తీసుకువస్తామని హామి ఇచ్చారు. ప్రభుత్వ తోడ్పాటుతో ఇప్పటికే అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని, త్వరలోనే మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలతో ముందుకు సాగుతామని వివరించారు. టియుఎఫ్ఐడిసి మంజూరు చేసిన 15కోట్ల నిధులతో -సురసముద్రం చెరువు ట్యాంక్‌బండ్, 3 పార్కులు, మాడ్గుల, షాద్‌నగర్ రోడ్డులో లైటింగ్, స్థానిక చెరువు కాలువలు, సిసి రోడ్ల నిర్మాణాలు చేపట్టనున్నట్లు ఆయన వివరించారు. మంజూరైన నిధులతో కాటన్‌మిల్లు ఎదురుగా ఉన్న వెంచర్, ధరణి వెంచర్, విఠాయిపల్లి, ముర్తూజపల్లిలో పబ్లిక్ పార్కులు నిర్మాణం కోసం రూ. 2.10కోట్లు కేటాయించినట్లు ఆయన వివరించారు. అలాగే సురసముద్రం ట్యాంక్‌బండ్‌పై వాకింగ్‌ట్రాక్, బతుకమ్మఘాట్, గ్రీనరి, సైక్లింగ్, సైడ్ లైటింగ్, రిటైనింగ్ వాల్ నిర్మాణం కోసం 2.50 కోట్లు, మాడ్గుల-షాద్‌నగర్ రోడ్డులోని గాంధిబొమ్మ నుండి సురసముద్రం చెరువు వరకు సైడ్ లైటింగ్ కొరకు 50లక్షలు, సురసముద్రం చెరువు కాలువ అభివృద్ధి, మురుగు నీరు పారేందుకు కోసం బిసి కాలనీ నుండి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వరకు 2.80కోట్లు కేటాయించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. అలాగే 7.10కోట్ల నిధులతో సిసి రోడ్లు నిర్మిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కాగా 32కోట్ల నిధులతో ప్రతి ఇంటికి మిషన్ భగిరథ నీరందించేందుకు రూ. 32కోట్లు నిధులు మంజూరయ్యాయన్నారు. ప్రభుత్వ జూనియర్‌కళాశాల భవన నిర్మాణ పనులకు టెండర్ ప్రక్రియలు సెకండ్ ఫేస్‌లో పూర్తయ్యాయని, కడ్తాల, తలకొండపల్లి మండలాలకు ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఓపెన్ కేటగిరిలో ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయినట్లు ఆయన వివరించారు. అంతకు ముందు ఎంపిపి అనితవిజయ్, జడ్పిటిసి అనురాధ పత్యనాయక్, టిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు గోలి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి మంగళపల్లి గ్రామంలో వైకుంతధామం, ఎస్సి కమ్యూనిటీ భవనం ప్రారంభోత్సవాలు, మంగళపల్లి, చింతలపల్లి గ్రామాలలో జడ్పిటిసి నిధుల నుండి రూ. 5లక్షలతో నిర్మించతలపెట్టిన మహిళా సమాఖ్య భవనాలకు ఎమ్మెల్యే గుర్కా శంఖుస్థాపన చేశారు. కార్యక్రమంలో చింతలపల్లి సర్పంచ్ మంజుల యాదయ్య, మంగళపల్లి సర్పంచ్ నర్సింహ్మారెడ్డి, నాయకులు, అర్జున్‌రావు, నిట్టనారాయణ, పత్యనాయక్, ఎనుముల రమేశ్, రమేశ్‌నాయక్, సరితపంతునాయక్, సోనశ్రీనునాయక్, సయ్యద్ ఖలీల్, అప్పం శ్రీను, చుక్క నిరంజన్‌గౌడ్, గుత్తి బాలస్వామి, రూపం వెంకట్‌రెడ్డి, వస్పుల సాయిలు, పూసలి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



మంగళపల్లిలో వైకుంఠధామం ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే గుర్కా జైపాల్‌యాదవ్

## సాధారణ సర్వసభ్య సమావేశంలో గళమెత్తిన సర్పంచ్‌లు

### - విద్యుత్ ఆధికారుల తీరుపై ప్రజాప్రతినిధుల ఆగ్రహం
### -సమావేశం నుండి ఏఈ బయటకి వెళ్లాలంటు నినాదాలు
### - వచ్చే సమావేశం కల్లా సమస్య రహిత మండలంగా తీర్చిదిద్దాలి : ఎంపిపి

**బషీరాబాద్,ఆగష్టు 01,ప్రభాతవార్త:**
బషీరాబాద్ మండల కేంద్రంలోని మండల ప్రజాపరిషత్తు కార్యాలయం నందు ఎంపిపి కరుణ సమక్షంలో సోమవారం నాడు నిర్వహించారు.ఈ సమావేశానికి మండల జడ్పిటిసి శ్రీనివాస్ రెడ్డి,పి.ఎ.సి.ఎస్ చైర్మన్ వెంకట్రామి రెడ్డి, ఎంపిడివో రమేష్,పలు శాఖల అధికారులు,ఆయా గ్రామాల సర్పంచ్ లు,ఎం.పి.టి.సి.లు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో శాఖల వారిగ సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా పలు గ్రామాల సర్పంచులు వారి వారి సమస్యలను విన్నవించుకున్నారు.దశల వారిగ అధికారులు వారి వారి సమస్యలను పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు.అనంతరం విద్యుత్ శాఖ ఆధికారి ఏఈ మైపాల్ మాట్లాడుతుండగా ఒక్కసారిగా సర్పంచ్ లు,ఎంపిటిసి లు విద్యుత్ అధికారి తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ సమావేశం నుండి తనను బయటకి పంపించాలంటూ ఆగ్రహం వెళ్ళగక్కారు.కరెంటు సమస్యలపై ఫోన్ చేసిన స్పందించని ఏఈ ని ఈ మండలం నుండి బదిలీ చేయించాలని డిమాండ్ చేశారు.అనంతరం మాసాన్ పల్లి సర్పంచ్ భీమప్ప మాట్లాడుతూ ఉపాధి పని కూలీలకు డబ్బులు అందడం లేదని సంబంధిత అధికారి తీరుపై మండిపడ్డారు.గత మూడు నెలలుగా కూలీలకు డబ్బులు అందడం లేదని పలుమార్లు అధికారులకు చెప్పిన పట్టించుకోవడంలేదని సమావేశంలో అధికారుల ముందు పేర్కొన్నారు.అనంతరం కాశింపూర్ సర్పంచ్ వెంకటయ్య మాట్లాడుతూ అధికారుల నిర్లక్ష్యం వల్లే బషీరాబాద్ అభివృద్ధిలో వెనుకబడిందని పేర్కొన్నారు.కుప్పన్‌కోట్ తాండ సర్పంచ్ పద్మ మాట్లాడుతూ విద్యార్థుల సౌకర్యార్థం ఉదయం 08గం॥లకు,సాయంత్రం 06గం॥ లకు తమ గ్రామానికి బస్సు వచ్చేటట్లు చూడాలన్నారు.అనంతరం పి.ఎ.సి.ఎస్ చైర్మన్ మాట్లాడుతూ రైతులకు అందుబాటులో డిఏపి,యూరియా లను ఉంచుతామన్నారు.రుణాలు అవసరం ఉన్న రైతులు తమ పిఏసిఎస్ కార్యాలయం నావద్ధి నందు సంప్రదించాలన్నారు.సర్పంచ్‌లు లేవనేత్తిన సమస్యలపై ఆయా శాఖల అధికారులతో జడ్పిటిసి మాట్లాడి సమస్యలను త్వరలో పరిష్కరించాలన్నారు.ఈ సమావేశంలో చివరగా ఎంపిపి మాట్లాడుతూ ఈసారి చాలామంది ప్రజాప్రతినిధులు సమావేశానికి హాజరు కావడం చాలా సంతోషం అన్నారు.హరితహారంలో భాగంగా మండలం మొత్తం ఒక లక్ష నలబై వేల మొక్కలు నాటాలని అన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి



సమావేశం నుండి ఏఈ ని బయటికి వెళ్లాలంటున్న దృశ్యం

## సమస్యలను సత్వర పరిష్కారానికి చర్యలు

### -జిల్లా అదనపు కలెక్టర్ జాన్ శ్యాంసన్

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 1, ప్రభాతవార్త**
ప్రజావాణిలో వచ్చిన సమస్యలను సత్వరమే పరిష్కరించటానికి చర్యలు చేపట్టటం జరుగుతుందని మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ జాన్ శ్యాంసన్ పేర్కొన్నారు. సోమవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణి కార్యక్రమం జరిగింది. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి వినతులను ఆయన స్వీకరించారు. జిల్లా వ్యాప్తంగ కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో 32వినతులు ప్రజల నుంచి అందినట్లు తెలిపారు. ఈ సందర్భంగ జిల్లా అదనపు కలెక్టర్ జాన్ శ్యాంసన్ మాట్లాడుతూ ప్రజల సమస్యలు సత్వరమే పరిష్కరించటానికి సంబంధిత జిల్లా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. వీటికి సంబంధించి అవసరమైన తగు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులు శాఖల వారీగ వచ్చిన వినతులు,ఫిర్యాదులు, ధరఖాస్తులు వంటి వాటి గురించి తెలుసుకుని పరిష్కరించాలని అధికారులకు సూచించారు. వినతుల పట్ల సంబంధిత అధికారులు వెంటనే స్పందించాలన్నారు. ఏమైనా వినతులు తిరస్కరించినట్లైతే వాటికి గల కారణాలను కూడ తెలియజేయాలన్నారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లోని జరిగిన ప్రజావాణిలో ప్రజల నుంచి వినతులు స్వీకరించి మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ జాన్ శ్యాంసన్,పాల్గొన్న జిల్లా అధికారులు

## వీఆర్ఓలకు లాటరీ పద్ధతిన పలు శాఖలలో విధుల కేటాయింపు

### -జిల్లా కలెక్టర్ నిఖిల





లాటరీ పద్ధతిన వీఆర్ఓ లకు పలు శాఖలలో విధులు కెటాయిస్తున్న కలెక్టర్ నిఖిల



హాజరైన పలు శాఖల అధికారులు

**వికారాబాద్, ఆగస్టు 1, ప్రభాతవార్త :**
జిల్లాలోని వీఆర్ఓ లకు 121 జీవో ప్రకారం పలు శాఖలలో లాటరీ పద్దతిన విధులను కెటాయించడం జరిగిందని జిల్లా కలెక్టర్ నిఖిల పేర్కొన్నారు. సోమవారం స్థానిక డీపీఆర్సీ భవనములో వీఆర్ఓ లకు విధుల కెటాయింపు ప్రక్రియ జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. జిల్లా అధికారులు, రెవెన్యూ సిబ్బంది సమక్షంలో నిర్వహించిన ప్రక్రియ పూర్తి పారదర్శకంగా వీడియో రికార్డింగ్ తో సహాయ నిర్వహించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. కెటాయింపుల అనంతరం వీఆర్ఓ లకు పోస్టింగ్ ఆర్డర్ కాపీలు వెంటనే ఇవ్వడం జరుగుతుందని అన్నారు. ఆర్డరు కాపీ పొందిన వెంటనే వీఆర్ఓ లు సంబంధిత శాఖలో రిపోర్టు చేయాలని ఆదేశించారు. జిల్లా అధికారులు అందరు కారానయలయాలల్లో ఉండి వీఆర్ఓ లను జాయిన్ చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి విజయకుమారి, ఏఓ అమరేందర్, అన్ని శాఖల జిల్లా అధికారులు, ఆర్ఐలు పాల్గొన్నారు.

## దమ్మాయిగూడ వరద ముంపు ప్రాంతాలను పరిశీలించిన మంత్రి

**కీసర,ఆగస్టు1,ప్రభాతవార్త:**
ఇటీవల కురిసిన వర్షాలకు దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలో భారీ వర్షాలకు ముంపుకు గురైన ప్రాంతాలను సోమవారం రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అధికారులతో కలిసి అంజనాద్రి ఎక్స్‌టేషన్,ఎంఎల్ఆర్,ఈఎస్ఎస్ హౌస్,సత్యనారాయణ కాలనీ,ఎల్ఎస్ఆర్,హరిహర కాలనీ, భవానీనగర్ కాలనీలను పరిశీలించారు.ఇటీవల కురిసిన వర్షాలతో తరచూ కాలనీలు ముంపుకు గురై ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొటుండటంతో శాశ్వత పరిష్కారం చూపే దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.వర్షాకాలంలో అప్రమత్తంగా ఉంటూ ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యలు వేగవంతం చేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వసుపతి ప్రణీత శ్రీకాంత్ గౌడ్,కమీషనర్ స్వామి,కౌన్సిలర్లు కొత్త సురేఖ భాస్కర్‌గౌడ్,సంపనబోలు స్వప్న హరిగౌడ్,పాండాల అనురాధ యాదగిరిగౌడ్,వసుపతి రమేష్‌గౌడ్,మంగళపురి వెంకటేష్,మౌనిక నరహరిరెడ్డి,రామారం శ్రీహరిగౌడ్,ముప్పు శ్రీలత రామారావు,పట్టణ అధ్యక్షులు కౌకుట్ల తిరుపతిరెడ్డి,ప్రధాన కార్యదర్శి సంపనబోలు హరిగౌడ్,కో ఆప్షన్ సభ్యులు వహిదా ఖజామియా తదితరులు పాల్గొన్నారు.



ఇటీవల కురిసిన వర్షాలకు ముంపుకు గురైన ప్రాంతాలను పరిశీలిస్తున్న మంత్రి మల్లారెడ్డి

## సీఎం రిలీఫ్ ఫండ్ పేదల పాలిట వరం

### -కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి


లబ్ధిదారుడికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేసిన మంత్రి మల్లారెడ్డి

**మేడ్చల్, ఆగష్టు 1. ప్రభాతవార్త ః**
సీఎం రిలీఫ్ ఫండ్ పథకం పేదల పాలిట వరంగా మారిందని కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డి అన్నారు. మేడ్చల్ మున్సిపాలిటిలోని 4వ వార్డుకుచెందిన తుడుం రవికి మంజూరైన రూ 60 వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును మంత్రి తనక్యాంపు కార్యాలయంలో సోమవారం అందజేశారు. ఈ సందర్బంగా మంత్రి మాట్లాడుతూఆరోగ్యానికి గురైన పేద ప్రజలకు సీఎం రిలీఫ్ ఫండ్ పథకం ద్వారా మెరుగైన వైద్య సేవలు అందించే సహయం అవుతున్నదని అన్నారు. పేద ప్రజలకు అందించే పథకాలనుసీఎం కేసీఆర్ నిర్విరామంగా అమలు చేస్తున్నారని, ఆర్థిక ఇబ్బందులు ఎన్ని ఉన్నా సీఎం రిలీఫ్ ఫండ్ పథకానికి నిధులు అందించి ఆదుకుంటున్నారని తెలిపారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని లబ్ధిపొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మున్సిపల్ వార్డు కౌన్సిలర్లు గణేష్, దేవరాజ్, కో ఆప్షన్ సభ్యుడు నవీన్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్‌నర్సింహరెడ్డి, నాయకుడు నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

### పండుగల సీజన్‌లో గ్రామంలో పరిశుభ్రత ఎంతో ముఖ్యం: ఎంపిపి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ వై.సుదర్శన్ రెడ్డి

**ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 1, ప్రభాతవార్త:**
గ్రామంలోని సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి అన్నారు. ఘట్‌కేసర్ మండలం అవుశాపూర్ గ్రామ పంచాయతీ సర్వసభ్య సమావేశం సోమవారం గ్రామ సర్పంచ్ ఏనుగు కావేరి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీపీ మాట్లాడుతూ గ్రామంలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రానున్న పండుగలు వరలక్ష్మి వ్రతం, మొహర్రం, బోనాల ఉత్సవాలు, శ్రావణ పౌర్ణమి, రాఖీ పౌర్ణమి, స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు, కృష్ణాష్టమి, వినాయక చవితి తదితర పర్వదినాల సందర్భంగా గ్రామంలో పారిశుద్ధ్య పనులు వేగవంతం చేసి గ్రామంలోని రోడ్లు, కాలనీలలోని రోడ్లు, వీధివీధి పరిశుభ్రంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. వర్షాలు విరివిగా కురుస్తున్నందున పారిశుద్ధ్యంపై గ్రామస్తులకు అవగాహన కల్పించాలని కోరారు. గ్రామ సర్పంచ్ కావేరి అధ్యక్షతన జరిగిన సమావేశానికి గ్రామ ఉప సర్పంచ్ ఎలుసాని అయిలయ్య యాదవ్, కార్యదర్శి ఉమాదేవి, వార్డు సభ్యులు బొడిగే శ్రీనివాస్ గౌడ్, కే. వీరేశం తదితరులు పాల్గొన్నారు.

### జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి

**మేడ్చల్, ఆగష్టు 1. ప్రభాతవార్త ః** మేడ్చల్‌లో ఈ నెల 10న నిర్వహించే జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని మేడ్చల్ ఎంపిపి రజిత రాజమల్లారెడ్డి ఓ ప్రకటనలో కోరారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్ యోజక పథకంలో అర్హులైన నిరుద్యోగ యువతీ, యువకులకు మేడ్చల్ మండల పరిషత్ కార్యాలయంలో ఈ జాబ్ మేళా నిర్వహించబడునని తెలిపారు. 10వ తేదీన నిర్వహించే ఈ కార్యక్రమానికి మండలంలోని యువతీ, యువకులు హాజరై అవకాశాన్ని సద్వినియోగపర్చుకోవాలన్నారు.

### అంకుశాపూర్‌లో సిసి రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన


సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఉప సర్పంచ్ బాలమణి పరిశీలిస్తున్న దృశ్యం

**ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 1, ప్రభాతవార్త:**
మండలంలోని అంకుశాపూర్‌లో గ్రామ పంచాయతీ నిధులు దాదాపు ఆరు లక్షలతో గ్రామ దేవతల ఆలయాల వద్ద చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను సోమవారం ఉప సర్పంచ్ చింతకింది బాలమణి పరిశీలించారు. గ్రామంలోని ఎస్సీ కాలనీలో పోచమ్మ, మైసమ్మ గుడుల వద్ద సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టినట్లు ఉప సర్పంచ్ తెలిపారు. రోడ్డు నిర్మాణ పనులను కార్యదర్శి మల్లారెడ్డి, పంచాయతీరాజ్ ఏఈతో పాటు టీఆర్ఎస్ మండల నాయకుడు చింత కింది వేణుగోపాల్ పర్యవేక్షించినట్లు తెలిపారు.

## ఆధార్ నమోదును సద్వినియోగం చేసుకోవాలి

### -చైర్‌పర్సన్ దీపిక నర్సింహరెడ్డి


ఆధార్ నమోదు కేంద్రాన్ని సందర్శించిన మేడ్చల్ మున్సిపల్ చైర్ పర్సన్ దీపిక నర్సింహరెడ్డి

**మేడ్చల్, ఆగష్టు 1. ప్రభాతవార్త ః** చిన్నారుల ఆధార్ నమోదు కోసం ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన నమోదు కేంద్రాలన్ని సద్వినియోగపర్చుకోవాలని మేడ్చల్ మున్సిపల్ చైర్ పర్సన్‌దీపిక నర్సింహరెడ్డి కోరారు. మేడ్చల్ పట్టణంలోని 7వ వార్డులో గల అంగన్‌వాడి కేంద్రంలో6 సంవత్సరాల లోపు చిన్నారుల ఆధార్ నమోదు కోసం 4 రోజుల ప్రత్యేక కేంద్రాన్నిఏర్పాటు చేశారు. ఈ కేంద్రాన్ని సోమవారం సందర్శించిన చైర్ పర్సన్ మాట్లాడుతూ అన్నివిదాలుగా ఉపయోగపడే ఆధార్ కార్డు అందరికి అవసరమని అన్నారు. కేంద్రంలోనె నమోదు పత్రం అందుబాటులోఉంటుందని, పుట్టిన తేది దృవీకరణ పత్రాన్ని జత చేసి ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు. చిన్నారుల ఆధార్ కోసం నాలుగు రోజుల పాటు నిర్వహించే ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలు ఉపయోగించుకుని తమ పిల్లలకు ఆధార్ నమోదు చేయించాలని కోరారు.


కొర్రెముల గ్రామంలో ఆదివారం రాత్రి బోనాలు ఉత్సవాల సందర్భంగా వార్డు సభ్యులు దుర్గారాజు గౌడ్ ఆధ్వర్యంలో పోచమ్మ అమ్మవారికి నిర్వహించిన తొట్టెల ఊరేగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిగా గ్రామ సర్పంచ్ వి. వెంకటేశ్‌గౌడ్ తదితరులు హాజరైన దృశ్యం. ( ఘట్‌కేసర్ రూరల్, ప్రభాతవార్త )

## విద్యార్థులు కష్టపడి చదవాలి..గొప్పవారు కావాలి : మంత్రి మల్లారెడ్డి

### -లక్ష్మాపూర్ జెడ్‌పి హైస్కూల్‌లో శ్రీసరస్వతి మాత విగ్రహం ఆవిష్కరణ


సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రి మల్లారెడ్డి,పాల్గొన్న ఎంపిపి, సర్పంచు, ఎంపిటిసి, అధ్యక్షులు, ఐఐఎల్ కంపెనీ ప్రతినిధులు, తదితరులు


దమ్మాయిగూడ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నోటు పుస్తకాలను అందిస్తున్న మంత్రి మల్లారెడ్డి

**శామీర్‌పేట, ఆగస్టు 1, ప్రభాతవార్త**
విద్యార్థులు కష్టపడి చదవాలని, ఉన్నత చదువులు చదివి గొప్పవారు కావాలని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి సిహెచ్ మల్లారెడ్డి సూచించారు. సోమవారం మూడు చింతలపల్లి మండలంలోని లక్ష్మాపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శ్రీసరస్వతి విగ్రహ ఆవిష్కరణ, ఐఐఎల్ కంపెనీ వారి చేత ఉచిత నోట్‌బుక్స్ పంపిణీ కార్యక్రమం జరిగింది. విగ్రహ దాత లక్ష్మాపూర్ గ్రామ టిఆర్ఎస్ అధ్యక్షులు గోపాల్ సరస్వతి మాత విగ్రహాన్ని హైస్కూల్‌లో ఏర్పాటు చేయగా మంత్రి మల్లారెడ్డి పాల్గొని ఆవిష్కరించారు. అదే విధంగ ఐఐఎల్ కంపెనీ వారు ప్రతి ఏటా మాదిరిగా ఈ సారి కూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఉచితంగ నోట్‌బుక్స్‌ను అందజేయటంతో మంత్రి చేతుల మీదుగా, కంపెనీ ప్రతినిధులు, పలువురు ప్రజాప్రతినిధులు విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్బంగ జరిగిన సమావేశంలో రాష్ట్ర మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి మంచి మెరిట్ సాధించాలని, ఉన్నత చదువులు చదివి మంచి ఉద్యోగాలు పొంది గొప్పవారు కావానలి సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్య, మెరుగైన సౌకర్యాలు, వసతి ఏర్పాట్లు చూడటానికి ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం మన ఊరు,మనబడి కార్యక్రమం ద్వారా అభివృద్ధి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. పాఠశాలలో సరస్వతి విగ్రహాన్ని ఏర్పాటు చేసిన దాత గోపాల్‌ను మంత్రి అభినందించారు. అదే విధంగ ఐఐఎల్ కంపెనీ వారు ప్రతి ఏటా ఉచితంగా నోట్‌బుక్స్‌ను విద్యార్థులకు అందజేస్తున్నందుకు మంత్రి దన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మూడుచింతలపల్లి ఎంపిపి వి.హారికమురళీగౌడ్, జడ్పీవైస్‌చైర్మన్ వెంకటేశ, గ్రామ సర్పంచు సింగం అంజనేయులు, ఎంపిటిసి పి.నాగరాజు, ఎఎంసి వైస్‌చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, టిఆర్ఎస్ నాయకులు ఎం.శ్రీనివాస్‌రెడ్డి, మండల టిఆర్ఎస్ అధ్యక్షులు జి.మల్లేశ్‌గౌడ్, గ్రామ టిఆర్ఎస్ అధ్యక్షులు గోపాల్, పలు గ్రామాల సర్పంచులు జామ్ రవి, విష్ణువర్ధన్‌రెడ్డి, మరి కొందరు, ఎంపిటిసిలు, ఐఐఎల్ కంపెనీ ప్రతినిధులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

### కీసర మండలంలో

**కీసర, ఆగస్టు1, ప్రభాతవార్తః** కార్పోరేటుకు ధీటుగా సర్కారు బడుల్లో పేద విద్యార్థులకు గుణాత్మక విద్యనందించడమే ధ్యేయంగా ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. దమ్మాయిగూడ మున్సిపాలిటీ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు వైస్ చైర్మన్ మాదిరెడ్డి నరేందర్‌రెడ్డి విద్యార్థులకు ఉచితంగా నోటు పుస్తకాల పంపిణీలో మంత్రి ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్బంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలో అన్ని రకాల సౌకర్యాలను కల్పించి అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం విద్యకు ప్రాధాన్యమిస్తూ నాణ్యమైన విద్యను అందిస్తుందని అన్నారు. విద్యార్దులు ఒక లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని లక్ష్య సాధనకు కృషి చేయాలన్నారు. తల్లిదండ్రులు విద్యార్దులను ప్రయివేటు పాఠశాలలకు పంపి ఆర్థికంగా నష్టపోవద్దని ప్రభుత్వ పాఠశాలల్లో కార్పోరేట్‌కు ధీటుగా విద్యను అందిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వసుపతి ప్రణీత శ్రీకాంత్‌గౌడ్, కమీషనర్ స్వామి, కౌన్సిలర్లు కొత్త సురేఖ భాస్కర్‌గౌడ్, సంపనబోలు స్వప్న హరిగౌడ్, పాండాల అనురాధ యాదగిరిగౌడ్, వసుపతి రమేష్‌గౌడ్, మంగళపురి వెంకటేష్, మౌనిక నరహరిరెడ్డి, రామారం శ్రీహరిగౌడ్, ముప్పు శ్రీలత రామారావు, పట్టణ అధ్యక్షులు కౌకుట్ల తిరుపతిరెడ్డి, ప్రధాన కార్యదర్శి సంపనబోలు హరిగౌడ్, కో ఆప్షన్ సభ్యులు వహిదా ఖజామియా, ఉపాధ్యాయులు, విద్యార్దులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్ల కోసం రోడ్డెక్కిన గ్రామాలు

### -నమ్మి ఓట్లు వేసిన పాపానికి నట్టేట ముంచిన వైనం
### -కాంగ్రెస్,బిజెపి ఆధ్వర్యంలో భారి ఎత్తున నిరసన


ఎంపీడివో సంధ్యకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు


బిక్షటన చేస్తూ నిరసన తెలుపుతున్న బిజెపి

**మొయినాబాద్ అగస్టు 1, ప్రభాతవార్త :**
రోడ్డ కోసం రోడ్డెక్కిన సురంగల్, శ్రీరామ్‌నగర్, వెంకటాపూర్ గ్రామస్తులు, కోట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో నీళ్లు, నియామాకాలు, నిధులు మాట దేవుడేరుగు, కనీస అవసరాలైన రోడ్లు, అండర్‌డ్రైనేజిలు, నీటి సరపరా వంటి విషయాలలో గ్రామ సర్పంచ్‌లు అధికారులు నిధులు లేక నీళ్ల నములుతున్న వైనం, గ్రామస్తుల ప్రశ్నలకు అధికారుల నుండి సమాదానం కరువు, చేసేదిలేక రోడ్డు ఎక్కి రోధిస్తున్న ప్రజలు, మొయినాబాద్ మండలంలోని చాల గ్రామాలకు రోడ్డు మార్గం శిధిలమై పోయింది, ఎండ్ల తరబడి రాజకీయ నాయకులను, అధికారులను కలిసినా మంత్రులు, వచ్చి శిలాపలకాలు వేసినా ప్రయోజనం లేకుండా పోయిందని సోమవారం మండల కేంద్రంలోని పలు గ్రామాల ప్రజలు మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నాకు దిగారు, బీజాపూర్ రహదారి పై పెద్ద ఎత్తునా వాహనాలు నిలిచి పోయాయి, మండల కేంద్రంలో బీజాపూర్ రహదారి పై ర్యాలి నిర్వహించి, అనంతరం ర్యాలిగా మండల ఎంపీడివో సంధ్య ను కలిసి గ్రామాల ప్రజలు గోడు వెల్ల బోసుకున్నారు, స్థానికి సమస్యలను వెంటనే పరిష్కరించాలని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ర్యాలి నిర్వహించారు, ఈ సందర్బంగా రాష్ట్ర ఎస్సి సెల్ ఉపాధ్యక్షుడు శాబాద్ దర్శన్ మాట్లాడుతూ మొయినాబాద్ మండల ప్రజల ఓట్లతో కాంగ్రెస్ పార్టీలో గెలిచిన ఎమ్మేల్యే కాలే యాదయ్య అభివృద్ధి పేరుతో టీఆర్ఎస్ పార్టీలో చేరి ఆయన అభివృద్ధి అయ్యాడు తప్ప ప్రజలకు చేసిందేమి లేదన్నారు, మండలంలోని స్థానికి సమస్యలను వెంటనే పరిష్కరించాలని లేదంటే చేవేళ్ల ప్రజల ఆగ్రహానికి ఎమ్మేల్యే గూరవడం కాయమన్నారు, రాష్ట్రాంలో దరిద్రంగా రోడ్లు మారడమేంటని ఎద్దేవచేశారు, ఈ కార్యక్రమంలో మండల సహకార సంఘం చైర్మెన్ చెంద్రారెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మానయ్య, మోత్కూపల్లి రాములు, శ్రీరామ్‌నగర్ ఎంపీటీసి రాంరెడ్డి, కేబుల్‌రాజు, ఉప్పసర్పంచ్ రాజేష్‌గౌడ్, యుత్ కాంగ్రెస్ చేవేళ్ల అధ్యక్షులు ఉప్పరి మధుగౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఎంపీటిసిలు, యువ నాయకులు సురంగల్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు, నిర్దుల మహేందర్ రెడ్డి, గడ్డం వెంకట్ రెడ్డి, యాలాల జైపాల్ రెడ్డి, బేగరి రాజు, ఎండీ షఫీ, గుర్రాల భాస్కర్, శ్రీరామ్‌నగర్ సంతోష్, మహేందర్, విక్రమ్ రెడ్డి, అంత్తయ్య, జంగయ్య తధితరులు పాల్గోన్నారు,

### బిజెపి ఆధ్వర్యంలో

గ్రామాల రోడ్ల కోసం భిక్షాటన చేయాల్సిన దౌర్భాగ్యం తెలంగాణ రాష్ట్రా సర్కారుకు మాత్రమే సాధ్యమైందని బిజెపి మండల కార్యదర్శి గుమ్మాల సీతారాం రెడ్డి పేర్కొన్నారు. బిజెపి ఆధ్వర్యంలో సోమవారం సురంగల్ గ్రామంలో రోడ్డు మరమ్మత్తుల కోసం భిక్షాటన చేశారు, ఈ సందర్భంగా సీతారాం రెడ్డి మాట్లాడుతూ గత 5 నెలల కింద తెలంగాణ మంత్రులు శిలాపలకాలు వేసి చేతులు దులుపుకున్నారు, నిత్యం ప్రయాణించే ప్రయాణికులు, రైతులు, పాల వ్యాపారులు, వెంకటాపూర్, శ్రీరామ్‌నగర్, సురంగల్ గ్రామాల ప్రజల పరిస్ధితి అగమ్యగోచరంగా మారిందన్నారు, గ్రామాల్లో గర్బిణీలు, పేషెంట్లు ఉన్నారని అంబ్యూలేన్స్ రావాలన్నా చాల ఇబ్బందిగా మారిందన్నారు, రోడ్డు మరమ్మత్తులు చేయడానికి ప్రభుత్వ అధికారులు, రాజకీయ నాకులు, పంచాయితీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో సురంగల్ బిజెపి నాయకులు దారిగుండా వెల్లే వారందరి వద్ద బిక్షాటన చేసి నిరసన తెలిపారు, ఈ కార్యక్రమంలో మండల కోశాధికారి పోతుల ప్రభుయాదవ్, యువ మోర్చ మండల అధ్యక్షుడు శ్రీకాంత్, యువమోర్చ మండల కార్యదర్శి ప్రశాంత్ గౌడ్, చేగూరి మధుసుదన్ గౌడ్, పి.శేఖర్, బి.జెగన్, బిజెవైఎం గ్రామ అదనయక్షుడు విజేయ్‌గౌడ్, వినాయక్ రెడ్డి, ఎమ్ మల్లేష్, పాండు, మహేష్ రెడ్డి, దుర్గం అంజి యాదవ్, ఎం. మాణిక్యం, శ్రీశైలం, శంబు యాదవ్, పి. మహేందర్, పి.శంకు తధితరులు పాల్గోన్నారు,

## ప్రజాభిష్టం మేరకు అభివృద్ధి పరచాలి

### జాతీయ ఓబిసి కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి


ఆచారితో కలిసి సిసి రోడ్డు పనులను ప్రారంభిస్తున్న చైర్మన్ రాంపాల్‌నాయక్

**ఆమనగల్లు, ఆగస్టు1, ప్రభాతవార్త:**
ఆమనగల్లు మున్సిపాలిటీని ప్రజాభిష్టం మేరకు అభివృద్ధి పరిచి ప్రజల కాంక్షను నెరవేర్చాలని జాతీయ ఓబిసి కమీషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి అన్నారు. ప్రజల భాగస్వామ్యంతో మున్సిపాలిటీని అన్ని విధాలుగా అభివృద్దిలో తీర్చిదిద్దాలని ఆయన ఆకాక్షించారు. సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డు ఎర్రబిక్యతండాలో నూతనంగా నిర్మిస్తున్న సిసి రోడ్డు నిర్మాణ పనుల ప్రారంభోత్సవం చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్ చైర్మన్ భీమనపల్లి దుర్గయ్యలతో కలిసి ఆచారి పాల్గొన్నారు. ఈమేరకు పూజా కార్యక్రమాలు నిర్వహించి పనులు ప్రారంభించారు. ప్రజల విశ్వాసానికి అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగించాలని సూచించారు. సిసి రోడ్ల ఆవశ్యకతను గుర్తించి మున్సిపాలిటీలో అన్ని వార్డులలో దశల వారీగా నూతన రోడ్లు నిర్మిస్తామని చైర్మన్ రాంపాల్‌నాయక్ తెలిపారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో రూ, 10లక్షలతో సిసి రోడ్డు నిర్మిస్తున్నట్లు రాంపాల్ నాయక్, దుర్గయ్యలు పేర్కొన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు తల్లోజు విజయ్‌కృష్ణ, దుద్దు కృష్ణ, విక్రమ్‌రెడ్డి, శ్రీకాంత్‌సింగ్, దేరంగుల శేఖర్, నంగ్రియనాయక్, మోత్యానాయక్, హనుమంతు నాయక్, పాం దునాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి కూలీలకు కూలీ డబ్బులు రాక అవస్థలు

### -ఏడు వారాల పనికి రెండు వారాల డబ్బులు చెల్లింపులు


ఉపాధి పనులకు హాజరైన కూలీలు (ఫైల్)

**పెద్దేముల్, ఆగస్టు 1, ప్రభాతవార్త:** దేవుడు వరమిచ్చిన పూజారి అడ్డుకుంటాడనే సామేత వలే ఉపాధి కూలీల పరిస్థితి తయారైంది. ప్రభుత్వం ఉపాధి కల్పించిన అధికారుల అలసత్వంతో కూలీడబ్బులు అందక ఉపాధి కూలీలు అవస్థలు పడుతున్నారు. మండలంలోని పెద్దేముల్, మంబాపూర్, కందనెల్లి, జనగాం, గాజీపూర్, నాగులపల్లి, గోపాల్‌పూర్, ఇందూరు, తట్టెపల్లి, తదితర గ్రామాలలో ఉపాధి పనులు చేసి రెండు నెలలు గడుస్తున్న ఇంతవరకు కూలీ డబ్బులు రాక ఇబ్బందులకు గురవుతున్నారు. ఏడు వారాలుగా పనిచేసిన తమకు రెండు వారాల డబ్బులు మాత్రమే చెల్లింపులు చేసినారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాము సక్రమంగా పనిచేసిన తమకు డబ్బులు ఎందుకు రావడంలేదని ఏకరువు పెడుతున్నారు. కూలీలకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం తమకు ఉపాధి కల్పించిన అధికారుల నిర్లక్ష్యంతోనే తమకు డబ్బులు సక్రమంగా అందడంలేదని ఆరోపిస్తున్నారు. ఆయా గ్రామాలలో ఇంతవరకు ఒక్క రూపాయి కూడా కూలీ డబ్బులు చెల్లించలేదని కూలీలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైన తాము చేసిన కూలీ డబ్బులను పూర్తిగా చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

### బలమైన నవీన సంస్కృతిని ప్రోత్సహిస్తుంది

నాగారం ఆగస్టు1, ప్రభాతవార్త : వినియోగదారు ఎలక్ట్రానిక్స్ దిగ్గజం శామ్‌సంగ్ సహా అంతర్జాతీయంగా ఉన్న తమ ఉద్యోగులతో తమ సీ-ల్యామ్ ద్వారా బలమైన నవీన సంస్కృతిని ప్రోత్సహిస్తోంది. సి ల్యాబ్ సంస్థలో ఉన్న ఆలోచనల ఇంకుబేషన్ ప్రోగ్రాం ఇది కంపెనీలో ఉంటూనే తమ సృజనాత్మకమైన ఆలోచనలను అర్థవంతమైన ఆఫరింగ్స్‌గా అభివృద్ధి చేయదానికి ఉద్యోగులకు వీలు కల్పిస్తుంది సవాళ్లకు ప్రతిస్పందించే కొత్త ఆలోచనలు మరియు పరిష్కారాలను స్వేచ్ఛగా ప్రతిపాదించడానికి ఉద్యోగులను ప్రేరేపించే సృజనాత్మకమైన సంస్కృతిని సి-ల్యాబ్ శామ్‌సంగ్‌లో అలవాటు చేసే లక్ష్యన్ని కలిగి ఉంది.

## కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల తీరుపై సిపిఐ పోరాటాలకు కార్యాచరణ

### -సిపిఐ రాష్ట్రదర్మివర్గసభ్యులు ఎన్.బాలమల్లేశ్
### -శామీర్‌పేటలో జరిగిన సిపిఐ మహాసభలు


.శామీర్‌పేట మినీస్టేడియంలో జరిగిన శామీర్‌పేట,మూడుచింతలపల్లి మండలాల సిపిఐ మహాసభలలో మాట్లాడుతున్న సిపిఐ రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యులు ఎస్.బాలమల్లేశ్, పాల్గొన్న జిల్లా సిపిఐ కార్యదర్శి డిజి సాయిలుగౌడ్, పలువురు నాయకులు

**శామీర్‌పేట, ఆగస్టు 1, ప్రభాతవార్త**
కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరును వ్యతిరేకిస్తూ సిపిఐ భవిషత్ పోరాటాలు చేయటానికి సిపిఐ మహాసభల్లో కార్యచరణను సిద్దం చేస్తున్నట్లు సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎన్.బాలమల్లేశ్ పేర్కొన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం, రాష్ట్రంలో టిఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను విస్మరించిందని ఆయన విమర్శించారు. సోమవారం శామీర్‌పేటలోని మినీస్టేడియంలో శామీర్‌పేట, మూడుచింతలపల్లి మండలాల సిపిఐ మహాసభలు మండల సిపిఐ కార్యదర్శులు డిజి నరేంద్రప్రసాద్, టి.రాములుగౌడ్‌ల ఆధ్వర్యంలో జరిగాయి. దీనిలో రాష్ట్ర నాయకులు బాలమల్లేశ్‌తో పాటు మేడ్చల్ జిల్లా సిపిఐ కార్యదర్శి డిజి సాయిలుగౌడ్,పలువురు జిల్లా నాయకులు కూడ పాల్గొన్నారు. ఈ సందర్భంగ జరిగిన సభలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు ఎన్.బాలమల్లేశ్ మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు రెండవ సారి అధికారం చేపట్టి ఇప్పటి వరకు ఎనిమిదేళ్ల దాటినా ఎన్నికల్లో ఇచ్చిన హామీలు గుర్తుకు రావటం లేదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏటా 2కోట్ల మందికి ఉపాధి కల్పిస్తామని చెప్పి నియామకాలు చేపట్టలేదని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలు మూతపడి ఎంతో మంది ఉపాధి కోల్పోతున్నారని అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థకు భంగం వాటిల్లుతుందని అన్నారు. బిజెపి ప్రభుత్వ కుట్రలను తిప్పికొట్టటానికి దేశంలోని లౌకికశక్తులన్నింటిని ఏకం చేయటానికి ప్రభుత్వ వ్యతిరేకతను చాటటానికి సిపిఐ పోరాటాలకు దిగుతుందన్నారు. రాష్ట్రంలో బంగారు తెలంగాణ చేస్తున్నామని అనటం సిగ్గుచేటని, బతుకు తెలంగాణ కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారని బాలమల్లేశ్ పేర్కొన్నారు. రాష్ట్రంలో గిరిజనులకు 12శాతం రిజర్వేషన్‌లు ఇస్తామని, దళితులకు మూడు ఎకరాల భూమి ఇస్తామని, డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు ఇస్తామని,నిరుద్యోగులకు ఉద్యోగాలు భర్తీ చేయలేదన్నారు. 57సంవత్సరాలు నిండిన వారికి ఆసరా ఫింఛన్లు ఇస్తామని చెప్పి ఇంత వరకు అమలు లేవని హామీలు వమ్ముచేశారని ఆయన విమర్శించారు. కీసర, బొమ్మరాసిపేట్, అంతాయిపల్లి, దేవరయాంజాల్ గ్రామాల భూసమస్యలు పరిష్కారం కాలేదన్నారు. ఈ నెల 8,9తేదీల్లో జిల్లా మహాసభలు జరుగనున్నట్లు దీనిలో పార్టీ పరిస్థితి,ప్రజాసమస్యలు పలు అంశాలపై చర్చలు జరుగనున్నట్లు తెలిపారు. జిల్లా సిపిఐకార్యదర్శి డిజి సాయిలుగౌడ్ మాట్లాడుతూ జిల్లాలోని 15మండలాల్లో సిపిఐ మహాసభలను నిర్వహించుకుని జిల్లాలోని కుత్బుల్లాపూర్‌లో జిల్లా స్థాయి మహాసభలు 8,9తేదీల్లో జరుపుకుంటున్నట్లు తెలిపారు. గ్రామాల సమస్యలపై మండలసభలో చర్చించామని, మండలాల సమస్యలను జిల్లా సభలో చర్చించనున్నట్లు సాయిలుగౌడ్ తెలిపారు. రెండు మండలాల మహాసభల్లో మూడుచింతలపల్లి మండల సిపిఐకార్యదర్శిగా టి.రాములుగౌడ్‌ను మరో సారి ఎన్నుకున్నారు. శామీర్‌పేట మండల సిపిఐ కార్యదర్శిగా వెంకటాచారిని ఎన్నుకున్నట్లు జిల్లా సిపిఐ కార్యదర్శి డిజి సాయిలుగౌడ్ ప్రకటించారు. ఈ సభలో సిపిఐ జిల్లా కార్యవర్గసభ్యులు టి.శంకర్, నాయకులు ఎన్.నర్సింహ్మా, ఇర్రి నర్సింహ్మారెడ్డి, డి.జంగయ్య, తిరుపతి, డిజి నరేంద్రప్రసాద్, టి.రాములుగౌడ్, సహదేవ్, వెంకటేశ్, అనిత,మంగమ్మ,డి.భూమయ్య,ఆర్.మల్లయ్య, మురళీదర్ రాజు, బాల్‌రాజ్‌గౌడ్, కృష్ణ,కె.సత్యనారాయణ, చంద్రయ్య,వెంకటేశ,యాదగిరి, చంద్రయ్య, మల్లేశ, కృష్ణగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

### బాలాజీ చిట్‌ఫండ్ నిర్వాహకులపై కేసు నమోదు

**తాండూరు, ఆగస్టు 1, ప్రభాతవార్త :** వికారాబాద్ జిల్లా తాండూరులోని బాలాజీ చిట్స్ ప్రైవేట్ లిమిటెడ్ నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్లు సీఐ రాజేందర్‌రెడ్డి తెలిపారు. చిట్‌ఫండ్‌లో చిట్టీలు వేయడంతో పాటు పలువురు బాదితులు పెద్ద ఎత్తున డిపాజిట్స్ చేశారు. చిట్టీలు, డిపాజిట్స్ చేసిన బాధితులకు డబ్బులు చెల్లించకుండా తప్పించుకు తిరుగతున్న బాలాజీ చిట్స్ మేనేజింగ్ డైరెక్టర్స్ గంగిశెట్టి శ్రీనివాసులు, గంగిశెట్టి గోపాలకృష్ణ, గంగిశెట్టి అనురాధ, గంగిశెట్టి సరితలపై బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు చీటింగ్ కేసుతో పాటు చిట్ ఫండ్ ఆక్ట్ కేసు, ఈర్వాఐ ఆక్ట్ కేసు నమోదు చేసినట్లు సీఐ వెల్లడించారు.

### విఆర్ఎల డిమాండ్‌లను పరిష్కరించాలి

**మొయినాబాద్ అగస్టు 1, ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్రా వ్యాప్తంగా గత రెండు వారాలుగా విఆర్ఎల నిరవదిక దీక్ష కోనసాగుతుంది, మొయినాబాద్ మండలంలో తహశీల్దార్ ఆఫీస్ ఎదుట సోమవారం వంట వార్పు కార్యక్రమాన్ని నిర్వహించారు, ఈ కార్యక్రమానికి మా నవతా దృక్పథంతో సురంగల్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు గడ్డం వెంకట్ రెడ్డి 5 వేల రూపాయలు విరాళాం అందజేశారు., ఈ సందర్భంగా గడ్డం వెంకట్ రెడ్డి మాట్లాడుతూ...సిఎం కెసిఆర్ అసెంబ్లీలో ప్రకటించిన విఆర్ఎల న్యాయమైన డిమాండ్‌లను అముల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విఆర్ఏ సంఘం నాయకులు యాదయ్య అర్జున్, కాంగ్రెస్ పార్టీ నాయకులు బేగరి రాజు పాల్గోన్నారు,

### బాలుడు అదృశ్యం

**మేడ్చల్, ఆగష్టు 1. ప్రభాతవార్త ః** మూగ బాలుడు అదృశ్యమైన సంఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చింతల్‌లోనివాసముండే కురుమూర్తి కొడుకు రాకేష్ పుట్టుకతో మూగవాడు. మేస్త్రీ పని చేస్తున్న కురుమూర్తి పని నిమిత్తం జులై 29న మేడ్చల్ మండలంలోని గౌడవెల్లికి రాగ అతనివెంట కొడుకు రాకేష్ కూడ వచ్చాడు. ఆ రోజు మద్యాహ్నం 2 గంటల నుంచి ఆ బాలుడు కనపడటం లేదు. అతని కోసం పరిసర ప్రాంతాల్లో వెతికినా అచూకి లభించకపోవడంతోతండ్రి మేడ్చల్ పోలీ స్‌స్టేషన్‌లో చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## పరిహారం ఇవ్వరూ....భూములు సాగు చేసుకోనివ్వరు

### -అడిగితే అరెస్టులు చేస్తారా?
### -చందన్‌వెల్లి భూబాధితులు
### -తమకు పరిహారం ఇప్పించాలని ఆందోళన


తమ భూముల్లో ఆందోళన చేస్తున్న చందన్‌వెల్లి భూబాధితులు

**షాబాద్, ఆగస్టు1, ప్రభాతవార్త :**
కంపెనీల కోసం ప్రభుత్వం తీసుకున్న భూములకు పరిహారం ఇవ్వరూ.... భూములు సాగు చేసుకుందామని వెళితే అరెస్టులు చేస్తామని పోలీసులు అడ్డుకోవడం ఏంటని బాధితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కంపెనీల ఏర్పాటు కోసం ప్రభుత్వం తీసుకున్న భూములకు తమకు పరిహారం అందలేదని బాధిత రైతులు సోమవారం భూములు సాగు చేసుకోవడానికి వెళితే పోలీసులు అడ్డుకోవడంతో ఆగ్రహించి అక్కడే ఆందోళనకు దిగారు. వివరాల్లోకి వెళితే.... షాబాద్ మండల పరిధిలోని చందన్‌వెల్లి గ్రామ రెవెన్యూ పరిధిలో 190,192 సర్వే నెంబర్‌లోని భూమిని ప్రభుత్వం కంపెనీల కోసం తీసుకుని టీఎస్ఐఐసీకి అప్పగించింది. ఎకరాకు రూ.9లక్షల పరిహారం చెల్లిస్తూ రైతుల నుండి తీసుకుంది. ఈ పరిహారం చెల్లింపులో అరు హ్లైన రైతులకు అందకుండా అక్రమార్కుల జేబుల్లోకి వెళ్లాయని రైతులు గత కొంతకాలం నుండి ఆందోళణ చేస్తున్నారు. అరుహ్లైన తమకు పరిహారం చెల్లించాలంటూ రైతులు స్థానిక తహసీల్దార్, ఆర్డీవో, కలెక్టర్ ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన ఫలితం లేకుండా పోయిందని రైతులు అంటున్నారు. న్యాయం చేస్తాను కార్యాలయంకు రండి అని చేవెళ్ల ఆర్డీవో మమ్మల్ని పిలిపించుకుని మీ భూములను టీఎస్ఐఐసీకి అప్పగించాం మీరు అక్కడికి వెళ్లి తేల్చుకోవాలని చెప్పారన్నారు. దీంతో దిక్కుతోచని రైతులు తమ భూములను సాగు చేసుకుని జీవనం సాగిద్దామని భూముల్లోకి వస్తే, పోలీసులు వచ్చి అరెస్టులు చేస్తామని తమను బెదిరిస్తున్నారంటూ వారు ఆవేధన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేసే వరకు అక్కడ నుంచి కదిలేదని వారు భీష్మించుకు కూర్చుని ఆందోళణ చేపట్టారు. ఈకార్యక్రమంలో ఆంజనేయులు, అంతయ్య, బాలయ్య, ఆనందం, శోభా, నర్సింలు, వెంకటయ్య, రవి, యాదమ్మ, రైతులు తదితరులు ఉన్నారు.

### అక్రమంగా భూములు లోకి వెళితే చర్యలు తప్పవు : షాబాద్ పోలీస్ ఇన్స్పెక్టర్ ఆశోక్....

టీఎస్ఐఐసీకి ప్రభుత్వం అప్పగించిన భూములివి. టీఎస్ఐఐసీ వారు ఫిర్యాదు చేశారు. వారి భూముల్లోకి ఎవ్వరూ పోయి ఇబ్బంది చేయకూడదు. శాంతియుతంగా రైతులకు రావాల్సిన పరిహారం కోసం ఆందోళన చేసుకోండి.


**PUBLIC NOTICE**

Notice is hereby given to General Public that my client is intending to purchase a Plot bearing No.441(Part), an extent of 161 Sq.Yards out of 250 Sq.Yards out of 250 Sq.Yrds in Sy.Nos.8,9 & 26 situated at Narepally Village, Ghatkesar Mandal, Medchal Malkajgiri District (earlier Ranga Reddy District), Telangana, being bounded by North: Plot no.440, South: Plot No.441 (Part), East: Road, West: 25' wide Road, from Syeda Farha, D/o.Syed Tajuddin, Resident of H.No.12-10-590/112/1, Warasiguda, Secundera bad-61 and is in the process of making advance sale consideration to the vendors. Any person or persons having or claiming any right, title, interest or estate whatsoever against or in respect of the said land or any part thereof by way of inheritance, mortgage, possession, Sale, share, gift, exchange, lease, grant/ devise, Contract, Charge, trust, maintenance/easement, transfer, license, bequest or otherwise or any or any other right or interest or whatsoever, are hereby required to give notice of the same in writing to the undersigned at office address H.No.1-4-24,Road No.2, Amrutha Avenue, Bandlaguda Jagir, Gandipet Mandal, R.R.District, Hyderabad- 500 086, within 15 days from the date of publication hereof together with copies of all documents on the basis of which such claims are made failing which, any such right, title, interest or claim, if any, shall be deemed to have been waived for all intends and purposes and shall not be binding on my client and my client will porceed with the execution and the registration of the Sale Deed in respect of the said land.

Sd/- M.JAYAKUMAR,
Advocate
H.No.1-4-24, Amrutha Avenue,
Bandlaguda Jagir, Gandipet Mandal,
R.R.District, Hyderabad- 500 086,
Cell: 9885754399, 6303724109.

## దళితుల ఆత్మగౌరవం కోసమే దళితబంధు

-షాద్‌నగర్ ఎమ్మెల్యే వై.అంజయ్య యాదవ్



నందిగామలో దళితబంధు పథకం ద్వారా కార్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

**నందిగామ ఆగస్టు 1,ప్రభాతవార్త :**
భారత రత్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆశయాల స్ఫూర్తితో దళిత జాతి ఆర్థిక ప్రగతే లక్ష్యంగా ముఖ్యమంత్రి కెసిఆర్ దళితబంధు పథకాన్ని ప్రవేశపెట్టారని షాద్‌నగర్ ఎమ్మెల్యే వై.అంజయ్య యాదవ్ అన్నారు.సోమవారం నందిగామ మండల కేంద్రంలో అప్పరెడ్డిగూడ గ్రామానికి చెందిన జంగయ్య, నర్సప్పగూడ గ్రామానికి చెందిన కొంగర యాదగిరి దళితబంధు పథకం ద్వారా కార్లు బహుకరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...దళితజాతి తరతరాలుగా అనుభవిస్తున్న పేదరికాన్ని,సామాజిక వివక్షను అంతమొందించడానికి ప్రవేశపెట్టిన ఈ పథకం దేశానికే ఆదర్శమన్నారు.దళిత బంధు కేవలం ఒక పథకమే కాదు,దళితులకు ఉపాధిని,ఆత్మగౌరవాన్ని అభివృద్ధిని,వికాసాన్ని చేకూర్చే ఆయుధమన్నారు.లబ్ధిదారులు దళితబంధు ద్వారా వచ్చిన ప్రగతి రథ చక్రాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జడ్పివైస్ చైర్మన్ ఈట గణేష్,ఎంపిపి ఎం.ప్రియాంక ,సర్పంచ్ జిల్లెల వెంకట్ రెడ్డి,చెగూరు సింగల్ విండో చైర్మన్ జి.అశోక్,సర్పంచులు గోవిందు అశోక్,జెకె నర్సింలు,ఎంపిడిఓ బాల్ రెడ్డి,ఉప సర్పంచ్ మెక్కొండ కుమార్ గౌడ్,టిఆర్ఎస్ మండల అధ్యక్షుడు నోముల పద్మారెడ్డి,ఆయా గ్రామాల నాయకులు కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

### మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం

**తలకొండపల్లి ఆగస్టు 1,ప్రభాతవార్త :** తలకొండపల్లి మండల పరిధిలోని మదాయపల్లి గ్రామానికి చెందిన ముదిగొండ రాములమ్మ వృధ్యాప్యంతో మరణించారు.ఈ విషయం స్థానిక వార్డు సభ్యులు బయ్యగౌరయ్య ద్వారా తెలుసుకున్న జడ్పిటిసి ఉప్పల వెంకటేష్ మృతురాలి కుటుంబా సభ్యులకు ప్రగాఢ సంపాన్ని తెలుపుతూ ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఆర్థిక సాయంగా 3వేల రూపాయలను అందజేశారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అజీజ్, వార్డు సభ్యులు ముదిగొండ ఎల్లయ్య,నాయకులు పరణ్ జ్యోతి శ్రీశైలం, జంగయ్య,ప్రవీణ్,నవీన్,తదితరులు పాల్గొన్నారు.

### చెన్నారం గ్రామంలో అంగన్‌వాడీ భవనం ఏర్పాటు చేయాలి



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్

**తలకొండపల్లి ఆగస్టు 1,ప్రభాతవార్త :**
తలకొండపల్లి మండల పరిధిలోని చెన్నారం గ్రామ సర్పంచ్ స్వప్న భాస్కర్ రెడ్డి సోమవారం రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు.చెన్నారం గ్రామంలో అంగన్‌వాడీ భవనం మంజూరు చేయాలని వినతిపత్రం అందజేసినట్లు మంత్రి సానుకూలంగా స్పందించినట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సుభాష్,తదితరులు పాల్గొన్నారు.

### పేద విద్యార్థుల చదువులకు దాతల సహకారం అవసరం

-బిజెపి చేవెళ్ల మండల శాఖ కార్యదర్శి అత్తెల్లి అనంతరెడ్డి



విద్యార్థులకు నోట్ పుస్తకాలను అందజేస్తున్న అత్తెల్లి అనంతరెడ్డి

**చేవెళ్ళ, ఆగస్టు 1, ప్రభాతవార్త**
పేద విద్యార్థుల చదువులకు దాతల సహకారం ఎంతో అవసరమని బిజెపి చేవెళ్ల మండల శాఖ కార్యదర్శి అత్తెల్లి అనంతరెడ్డి అన్నారు. సోమవారం పాఠశాల విద్యార్థులకు రూ.20 వేలు విలువ చేసే నోట్ పుస్తకాలను ఎంఇఒ అక్బర్‌తో కలిసి అందజేశారు.ఈ సందర్భంగా బిజెపి చేవెళ్ల మండల శాఖ కార్యదర్శి అత్తెల్లి అనంతరెడ్డి మాట్లాడుతూ దాతల సహకారంతో విద్యార్థులు కష్టపడి చదువుకోవాలన్నారు. దాతలు ఎంత మంది ముందుకు వస్తే అంత మంది విద్యార్థులు విద్యపరంగా అభివృద్ధి చేందుతారన్నారు.పేద విద్యార్థులకు అవసరమైన మౌళిక సదుపాయాలు సమకుర్చుతున్నామన్నారు. విద్యాభివృద్ధికి ప్రతి ఒక్కరు తమ వంతు సహకారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్త రామక్రిష్టా, ప్రధానోపాధ్యాయులు ఖాజా పాషా, బిజెపి పట్టణ అధ్యక్షుడు గాజుల గూడెం శ్రీనివాస్‌రెడ్డి, బిజెవైఎం పట్టణ అధ్యక్షుడు బండారు శేఖర్‌రెడ్డి, దళిత మోర్చా అధ్యక్షుడు అశోక్, అత్తెల్లి ప్రశాంత్‌రెడ్డి, ఉపాధ్యాయులు కిరణ్‌మహేందర్‌రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

## రైతు బీమా దరఖాస్తుకు గడువు ముగిసింది

- ఫరూఖ్‌నగర్ మండల వ్యవసాయాధికారి నిషాంత్‌కుమార్



రైతుల ధరఖాస్తులను స్వీకరిస్తున్న వ్యవసాయాధికారి నిషాంత్‌కుమార్

**షాద్‌నగర్, ఆగస్టు 1, (ప్రభాతవార్త) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతు కుటుంబాల కోసం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన రైతు భీమా పథకం 2022 సంవత్సరానికి గాను ధరఖాస్తు చేసుకోవడానికి నిన్నటితో ముగిసింది. రైతు భీమా ధరఖాస్తుకు సోమవారం ఆఖరి రోజు కావడంతో ఫరూక్‌నగర్ మండల వ్యవసాయాధికారి కార్యాలయానికి రైతులు అధిక సంఖ్యలో తరలి వచ్చి ధరఖాస్తులను అందజేశారు. మండల వ్యవసాయాధికారి నిషాంత్ కుమార్ కార్యాలయానికి వచ్చిన రైతుల ధరఖాస్తులను పరిశీలించి స్వీకరించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి నిషాంత్‌కుమార్ మాట్లాడుతూ... తెలంగాణ ప్రభుత్వం అందజేస్తున్న రైతు భీమా పథకం గురించి ప్రతి గ్రామంలో, రైతు వేదికల వద్ద రైతులకు వివరిస్తూ అవగాహన కల్పించి రైతు భీమాకు ధరఖాస్తు చేసుకునేలా ప్రోత్సహిస్తున్నామని ఆయన తెలిపారు. ఇప్పటి వరకు ఫరూఖ్‌నగర్ మండలంలో మొత్తం 23675 మంది రైతులకు గాను 11985 మంది రైతులు రైతు భీమాకు ధరఖాస్తు చేసుకున్నారని, ఇం కా 6796 మంది రైతులు ఇంకా ధరఖాస్తు చేసుకోలేదని ఆయన వివరించా రు. ధరఖాస్తు చేసుకోని ప్రతి రైతుకు ఫోన్ ద్వార సమాచారం అందించామని అయిన ఇంకా కొంత మంది రైతులు ధరఖాస్తు చేసుకోలేదని ఆయన తెలిపా రు. రైతు భీమాకు ధరఖాస్తు చేసుకుంటే కుటుంబానికి భరోసా ఉంటుందని రైతులు తప్పని సరిగా ధరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. రైతుల ధరఖాస్తులు స్వీకరించిన వారిలో ఫరూఖ్‌నగర్ ఏఈఓ తేజ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

### చెన్‌గోముల్ ఎస్ఐగా పదవీ బాధ్యతలు చెపట్టిన భీంకుమార్

**పూడూరు, ఆగస్టు 1, ప్రభాతవార్త :** పూడూరు మండలం చెన్‌గోముల్ ఎస్ఐగా భీంకుమార్ సోమవారం పదవీ బాధ్యతలను చేపట్టారు.గతంలో ఇక్కడ ఎస్ఐగా పనిచేసిన శ్రీశైలం దీర్ఘకాలిక సెలవుపై వెళ్లడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇంటలీజంట్స్ డిపార్టుమెంట్‌లో పనిచేస్తున్న భీంకుమార్ బదిలీపై ఇక్కడికి వచ్చారు.కాగా గతంలో చెన్‌గోముల్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐగా పనిచేసి వెళ్లిన భీంకుమార్ తిరిగి ఇక్కడికే రావడం గమనార్హం.ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ అందరి సహకారంతో శాంతిబద్రతలను కాపాడుతానని వివరించారు.

## ప్రతి గ్రామ పంచాయతీకి నిధులు మంజూరు

-ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి సర్పంచులకు హామీ



ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డిని కలిసి నిధులు మంజూరు చేయాలని కోరిన చేవెళ్ల మండలంలోని సర్పంచులు

**చేవెళ్ళ, ఆగస్టు 1, ప్రభాతవార్త**
చేవెళ్ళ మండలంలోని ప్రతి గ్రామ పంచాయతీకి నిధులు మంజూరు చేస్తానని ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి సర్పంచులకు హామి ఇచ్చారు. సోమవారం ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి నివాసంలో చేవెళ్ల మండలంలోని సర్పంచుల ప్రతి గ్రామ పంచాయతీకి నిధులు మంజూరు చేయాలని కోరారు. ఇందుకు ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి స్పందించి ప్రతి గ్రామ పంచాయతీకి అభివృద్ధి కోసం నిదులు మంజూరు చేస్తానని స్పందిచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామ పంచాయతీలల్లో నిదులుంటేనే గ్రామాలు అభివృద్ధి చేందుతాయన్నారు. గ్రామాల అభివృద్ధికి ఎన్ని నిధులైన మంజూరు చేసేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు. గ్రామాలకు కావాల్సిన పనులలను అంచన వేయాలన్నారు. ఏ గ్రామానికి ఎన్ని నిధులు కావాలో జాబితాను సిద్దం చేయాలన్నారు. గ్రామాల అభివృద్ధికి ఎన్ని నిధులైన మంజూరు చేసేందుకు సిద్దంగా ఉన్నామన్నారు.రేగడి ఘనాపూర్ నుండి చన్‌వల్లి రోడ్డుపై గల వాగుపై వంతెన నిర్మాణంకు 25 లక్షలు మంజూరు చేయాలని ఆ గ్రామ సర్పంచ్ విన్నవించారు. అవసరమైన రోడ్లపై వంతెనల నిర్మాణాలకు నిధులు మంజూరు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో దామరిగిద్ద సర్పంచ్ వెంకటేశంగుప్తా, మీర్జాగూడ్ సర్పంచ్ బీమయ్య, తలారం సర్పంచ్ సురేదర్, ఉరెళ్ల సర్పంచ్ జాంగీర్, అంతారం సర్పంచ్ సులోచన అంజయ్యగౌడ్, ముడిమ్యాల సర్పంచ్ స్వర్ణలత దర్శన్, సింగప్పగూడ సర్పంచ్ అలీ, నాంచేరి సర్పంచ్ సక్కుబాయి అమరేందర్‌గౌడ్, రామన్నగూడ సర్పంచ్ లావణ్యశంకర్, తంగడ్‌పల్లి సర్పంచ్ అనుషసత్తయ్య, రేఘడిఘనాపూర్ మాజీ సర్పంచ్ రాంరెడ్డి,కుమ్మెర మాజీ సర్పంచ్ పాండు తదితరులు పాల్గొన్నారు.

## బూర్గుల గ్రామాన్ని మండలం చేయాలి

- ఆర్డీఓ రాజేశ్వరికి వినతి పత్రం అందజేసిన గ్రామస్థులు

**షాద్‌నగర్, ఆగస్టు 1, (ప్రభాతవార్త) :**
ఫరూఖ్‌నగర్ మండలంలోని బూర్గుల గ్రామాన్ని మండలంగా చేయాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. సోమవారం బూర్గుల గ్రామానికి చెందిన పెద్దలు అధిక సంఖ్యలో ఆర్డీఓ కార్యాలయానికి తరలి వచ్చి తమ గ్రామానికి మండలంగా తీర్చిదిద్దాలని ఆర్డీఓ రాజేశ్వరికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్థులు మాట్లాడుతూ... 1952వ సంవత్సరంలో బూర్గుల గ్రామం నుంచి అప్పటి ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణరావు షాద్‌నగర్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి హైదరాబాద్ స్టేట్ తొలి ముఖ్యమంత్రిగా చేశారని, అదేవిధంగా రెండు రాష్ట్రాలకు గవర్నర్‌గా వ్యవహరించారని వారు గుర్తు చేశారు. బూర్గుల రామకృష్ణారావు సేవలకు చిహ్నంగా తమ గ్రామాన్ని మండలంగా తీర్చిదిద్దాలని గ్రామస్థులు కోరుతున్నారు. బూర్గుల మండలకేంద్రం కావాలని చుట్టు పక్కలన ఉన్న 11 గ్రామ పంచాయతీల ప్రజలు కోరుకుంటున్నారని వారు పేర్కొన్నారు. తమ గ్రామానికి మండల కేంద్రం కావడానికి అన్ని అర్హతలు ఉన్నాయని, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి బూర్గుల గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించాలని వారు డిమాండ్ చేశారు. అటు హైవే, ఇటూ రైల్వే స్టేషన్, గ్రామంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల, పీహెచ్‌సీ,, విద్యుత్ సబ్‌స్టేషన్, గ్రామీణ బ్యాంకు, పోస్టాఫీసు, ఆయుర్వేద వైద్యశాల, ఆశ్రమము, పరిశ్రమలు ఇలా ఇన్ని విధాల సదుపాయాలు ఉన్న గ్రామాన్ని మండలం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పోచయ్య, ఆశోక్, శ్రీనునాయక్, హరికృష్ణగౌడ్, కుమార్‌గౌడ్, బాలునాయక్, సంతోష్‌కుమార్‌గౌడ్, దాసు నాయక్, శేఖర్, తిరుపతయ్య, మల్లేస్, ఆంజనేయులుగౌడ్, కూచరి కృష్ణయ్య, రవినాయక్, రాజునాయక్, సంజయ్య, రమేష్, కావాలి కృష్ణ, వెంకటయ్య ఉన్నారు.



ఆర్డీఓ కార్యాలయం వద్ద బూర్గుల గ్రామస్థులు

## తెలంగాణకు మళ్లీ మూడవ సారి సిఎంగా కెసిఆర్

-రానున్న ఎన్నికల్లో టిఆర్ఎస్ విజయం సాధించడం ఖాయం
-చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కెఎస్ రత్నం వెల్లడి



చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కెఎస్ రత్నంను కలిసిన చేవెళ్ల మండలంలోని నాయకులు, సర్పంచులు

**చేవెళ్ళ, ఆగస్టు 1, ప్రభాతవార్త**
తెలంగాణకు మళ్లీ మూడవ సారి సిఎంగా కెసిఆర్ ప్రమాణ స్వీకారం చేపడుతారని చేవెళ్ళ మాజీ ఏమ్మెల్యే కెఎస్ రత్నం దీమా వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికల్లో టిఆర్ఎస్ పార్టీ ఘన విజయం సాధించడం ఖాయమని చేవెళ్ళ మాజీ ఎమ్మెల్యే కెఎస్ రత్నం చేవెళ్ల మండంలోని నాయకులకు, సర్పంచులకు సూచించారు. సోమవారం నగరంలోని అయన వివాసంలో చేవెళ్ల మండలంలోని నాయకులు, సర్పంచులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్బంగా చేవెళ్ళ మాజీ ఎమ్మెల్యే కెఎస్ రత్నం మాట్లాడుతూ పార్టీ పటిష్టతకు గ్రామ స్దాయిలో సర్పంచుల పాత్ర కీలకమన్నారు. గ్రామాలు అభివృద్ధి చేందాయంటే సిఎం కెసిఆర్ చలవనే అన్నారు.ప్రతి గ్రామంలో పల్లె ప్రకృతి వనాలు, స్వశాన వాటికలు,డంపింగ్ యార్డులు, దళిత బందు, రైతు బందు వంటి పథకాలను ప్రవేశ పెట్టి చరిత్రలో నిలిచిపోయారన్నారు. చేవెళ్ల నియోజకవర్గంని ప్రతి గ్రామం అభివృద్దికి మంత్రి సబితారెడ్డి, మాజీ మంత్రి ఎమ్మెల్సీ ఎమ్మెల్యే పట్నం మహేందర్‌రెడ్డిలు చేసిన కృషి అన్నారు. పార్టీ పటిష్టతకు ప్రతి ఒక్కరు పాటుపడాలన్నారు. చేవెళ్ల మండంలోని సమస్యలు తమ నా దృష్టికి తీసుకువస్తే మంత్రి సబితారెడ్డికి వివరించి పరిష్కరించేందుకు పాటుపడుతామన్నారు. రానున్న ఎన్నికల్లో పార్టీ విజయంకు ప్రతి ఒక్కరు పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల నియోజకవర్గ యుత్ నాయకుడు వనం లక్ష్మీకాంత్‌రెడ్డి, దామరిగిద్ద సర్పంచ్ వెంకటేశంగుప్తా, మీర్జాగూడ్ సర్పంచ్ బీమయ్య, తలారం సర్పంచ్ సురేదర్, ఉరెళ్ల సర్పంచ్ జాంగీర్, అంతారం సర్పంచ్ సులోచన అంజయ్యగౌడ్, ముడిమ్యాల సర్పంచ్ స్వర్ణలత దర్శన్, సింగప్పగూడ సర్పంచ్ అలీ, నాంచేరి సర్పంచ్ సక్కుబాయి అమరేందర్‌గౌడ్, రామన్నగూడ సర్పంచ్ లావణ్యశంకర్, తంగడ్‌పల్లి సర్పంచ్ అనుషసత్తయ్య, రేఘడిఘనాపూర్ మాజీ సర్పంచ్ రాంరెడ్డి,కుమ్మెర మాజీ సర్పంచ్ పాండు, రావులపల్లి మాజీ సర్పంచ్ రాంచంద్రయ్య, తంగడ్‌పల్లి మాజీ సర్పంచ్ రాములుగౌడ్ తదతరులు పాల్గొన్నారు.

### అలుగు నీళ్లను మళ్లించేందుకు కట్టలు ఏర్పాటు



**తలకొండపల్లి ఆగస్టు1,ప్రభాతవార్త :**
తలకొండపల్లి మండల పరిధిలోని దేవునిపడకల్ గ్రామంలోని ముమత్ఖార్ చెరువులోకి విపరీతమైన వరదనీరు వచ్చి చేరడం వలన గండిపడే ప్రమాదం ఉండడంతో నీళ్లను అలుగువైపు మళ్లింప చేయడానికి జెపిబితో కట్టలు వేయించడం జరిగింది.ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ...ఈ వరద వలన పంట నష్టం కూడా జరుగుతుంది.కానీ రైతులకు ఎలాంటి నష్ట పరిహారం రాలేదు.అలాగే మత్స్యకారు కుటుంబాలకు జీవనాదారమైన వృత్తి చేపల పెంపకం కూడా కష్టంగా మారింది.పెంచిన చేపలన్ని కొట్టుక పోవడం జరుగుతుంది.కావున తక్షణమే ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఎంపిపి తిరుమణి నిర్మల శ్రీశైలం గౌడ్,ఇరిగేషన్ డిఈ శర్మిళ,ఎమ్మార్వో కృష్ణ,ఎంపిడివో రాఘవులు,ఎంపివో రఘు, సర్పంచ్ శ్రీశైలం,ఉప సర్పంచ్ తిరుపతి,పంచాయతీ కార్యదర్శి జంగయ్య,వార్డు సభ్యులు గ్రామస్థులు పాల్గొన్నారు.

### కొనసాగుతున్న ఎమ్మార్పీఎస్ రిలే నిరహార దీక్షలు

-ఎస్సీ వర్గీకరణను వెంటనే అమలు చేయాలని నాయకులు డిమాండ్

**షాద్‌నగర్, ఆగస్టు 1, (ప్రభాతవార్త) :**
ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మాంద కృష్ణ మాదిగ పిలుపు మేరకు షాద్‌నగర్ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు సోమవారం 8వ రోజుకు చేరుకున్నాయి. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణనే ధ్యేయంగా గత 8 రోజులుగా షాద్‌నగర్ పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం ముందు చేపడుతున్న దీక్షల్లో నియోజకవర్గంలోని ప్రతి ఎమ్మార్పీఎస్ నాయకుడు పాల్గొంటున్నారు. ఫరూఖ్‌నగర్ మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు కల్లెపల్లి బాలరాజ్ ఆధ్వర్యంలో పలువురు ఎమ్మార్పీఎస్ నాయకులు దీక్షలో కూర్చున్నారు. ఈ సందర్భంగా దీక్ష శిబిరానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా కన్వీనర్ పెంటనోళ్ల నరసింహా మాదిగ మాట్లాడుతూ... ఏబీసీడీ వర్గీకరణ చేసి అందరికి సమాన అవకాశాలు కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాని ఆయన పేర్కొన్నారు. ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ చట్టాన్ని వెంటనే చట్టసభలో ప్రవేశపెట్టి ప్రతి ఒక్కరికి న్యాయం చేయాలని, లేనిచో రాజకీయ సంక్షోభం సృష్టిస్తామని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బుర్ర రామచంద్రయ్య, కల్లెపల్లి బాలరాజు, బొబ్బిలి పాండు, శ్రవణ్‌కుమార్, నల్లకృష్ణ, జంగయ్య, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

### 3న ఛలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి : సిఐటియు

**శామీర్‌పేట, ఆగస్టు 1,ప్రభాతవార్త**
కనీస వేతనాల పెంపుదల, జీఓల సవరణకై ఈ నెల 3వ తేదీన ఛలో హైదరాబాద్ కార్యక్రమం జరగుతుందని కార్మికులు అందరు పాల్గొని విజయవంతం చేయాలని శామీర్‌పేట మండల సిఐటియు నాయకులు ఎం.కిష్టప్ప కోరారు. సోమవారం ఆయన మాట్లాడుతూ తెలంగాణ సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఛలో హైదరాబాద్ కార్యక్రమం జరుగుతుందని సిఐటియు నాయకులు, కార్మికులతో పాటు కార్మికులు అందరు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కనీస వేతనాల పెంపుపై 5రంగాలకు ఇచ్చిన ఫైనల్ నోటిఫికేషన్‌కు గెజిట్ ఇవ్వాలని, 73షెడ్యూల్ పరిశ్రమల కనీస వేతనాల జీవోలను సవరించాలని, కనీస వేతనం రూ. 26వేల నిర్ణయించాలని, కాంట్రాక్టు కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, బీడీ కార్మికుల, హామాలీల, భవన నిర్మాణ కార్మికుల, సేల్స్ ప్రమోషన్ ఉద్యోగుల కనీస వేతనాలు నిర్ణయించాలని డిమాండ్ చేస్తున్నట్లు, కేంద్రం తెచ్చిన 4లేబర్ కోడ్‌లను ఉపసంహరించుకోవాలని ప్రభుత్వానికి డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు.

### రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న భారతీయ కిసాన్‌సంఘ్ జిల్లా అధ్యక్షుడు గజేందర్‌గౌడ్

**షాబాద్, ఆగస్టు1, ప్రభాతవార్త :**
అధిక వర్షాలకు పంటలు దెబ్బతిన్న రైతులకు ప్రభుత్వం పరిహారం చెల్లించాలని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు గజేందర్‌గౌడ్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని రైతువేదికలో భారతీయ కిసాన్‌సంఘ్ మండల అధ్యక్షులు యాదవరెడ్డి ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.... రైతులు ఆరుగాలం కష్టపడి వేసిన పంటలు అధిక వర్షంతో తీవ్రంగా దెబ్బతిన్నాయన్నారు. పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం చెల్లించాలన్నారు. పంటలు నష్టపోయిన రైతులకు ఆర్థికసాయం అందేలా పంట బీమా సౌకర్యం కల్పించాలన్నారు. అలాగే వ్యవసాయానికి ఇరవై నాలుగు గంటల విద్యుత్ సరఫరా చేస్తామన్న ప్రభుత్వం కనీసం ఐదారు గంటల కూడా నాణ్యంగా అందించలేకపోతుందన్నారు. వ్యవసాయానికి ఇరవై నాలుగు గంటల నాణ్యమైన విద్యుత్ అందించాలన్నారు. ఈకార్యక్రమంలో సంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు సత్యనారాయణరెడ్డి, రైతులు రామస్వామిగౌడ్, వెంకట్‌రెడ్డి, అంజయ్య తదితరులు ఉన్నారు.

## బండి సంజయ్ పాదయాత్రను విజయవంతం చేయండి

-బుక్క వేణుగోపాల్

**శంషాబాద్ ఆగస్టు 1,ప్రభాతవార్త :** ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజల స్థితిగతులను తెలుసుకోవడం కోసం తెలంగాణ బిజెపి చీఫ్ బండి సంజయ్ కుమార్ చేస్తున్న మూడవ విడత పాదయాత్రను విజయవతం చేయాలని రాజేంద్రనగర్ నియోజకవర్గం బిజెపి నాయకుడు బుక్క వేణుగోపాల్ పిలుపునిచ్చారు.ఆగస్టు 2వ తేది యాదాద్రి నుండి ప్రారంభమయ్యే మూడో విడత పాదయాత్ర ఈ నెల 26వ తేదిన హనుమకొండ భద్రకాళి మాత ఆలయం వరకు కొనసాగి అక్కడ ముగుస్తుందని తెలిపారు.రాష్ట్రంలో అధికారంలో ఉన్న టిఆర్ఎస్ చేపడుతున్న అవినీతి బంధుప్రీతి కుటుంబ పాలనకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యవంతులను చేయడానికి బండి సంజయ్ యాత్రను చేపట్టారని బుక్క వేణుగోపాల్ వివరించారు.

### విఆర్ఎల ధర్నాకు మద్దతు తెలిపిన ఆచారి



**తలకొండపల్లి ఆగస్టు 1,ప్రభాతవార్త :**
సిఎం కెసిఆర్ అసెంబ్లీలో విఆర్ఎలకు ఇచ్చిన హమిలను వెంటనే అమలు చేయాలని బిజెపి జాతీయ నాయకులు ఆచారి డిమాండ్ చేశారు.సోమవారం తలకొండపల్లి మండల కేంద్రంలో విఆర్ఎల నిరవధిక దీక్షకి ఆయన మద్దతు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన విఆర్ఎలకు ఇచ్చిన హామిలను వెంటనే అమలు చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో మండల నాయకులు, పధికారులు,బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు.

### ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలి

- తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య



ఆర్డీఓ కార్యాలయంలో వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

**షాద్‌నగర్, ఆగస్టు 1, (ప్రభాతవార్త) :**
రాష్ట్రంలో పేద ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కారించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య అన్నారు. సోమవారం బీకేఎంయూ జాతీయ కమిటీ పిలుపు మేరకు షాద్‌నగర్ ఆర్డీఓ కార్యాలయంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య ఆధ్వర్యంలో ఏఓకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రస్తుతం అమల్లో ఉన్న భూ చట్టాలను మార్పు చేసి 10 లేదా 15 ఎకరాలకు పరిమితి చేయాలని ఆయన కోరారు. 55 సంవత్సరాలు నిండిన పేదలకు నెలకు 5వేల ఆసరా ఫించన్లు అందజేయాలని, దళిత బంధులాగే నిరుపేదలందరికి కూలీ బంధు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. రేషన్ కార్డులు లేక ఇబ్బందులు పడుతున్న వారందరికి వెంటనే రేషన్ కార్డులు మంజూరు చేయాలన్నారు. అదేవిధంగా కొందుర్గు మండల కేంద్రంలో సర్వే నెంబర్ 237లో 10 ఎకరాల భూమిని పేదలకు 100 గజాల చొప్పున గత ప్రభుత్వం కేటాయించిందని, ఇప్పుడు ఆ భూమిని ఇతరులు చదును చేస్తున్నారని, వారి నుంచి భూమిని కాపాడి అందులో డబుల్ బెడ్‌రూంలను నిర్మించి పేద వారికి అందజేయాలని ఆయన డిమాండ్ చేశారు. అదేవిధంగా ఉపాధి హామికి 200 రోజులు పెంచాలని, రోజు కూలీకి 600 ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో అనసూయ, యాదమ్మ, రేణుక, ఎల్లయ్య పాల్గొన్నారు.

### అన్నోజిగూడలో ఘనంగా మహంకాళి అమ్మవార్ల విగ్రహాల ఊరేగింపు



అన్నోజిగూడలో శ్రీ మహంకాళి అమ్మవారి విగ్రహాల ఊరేగింపు కార్యక్రమంలో పాల్గొన్న చైర్మన్ బి. కొండల్ రెడ్డి తదితరులు

**ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 1, ప్రభాతవార్త:**
పోచారం మున్సిపల్ పరిధిలోని అన్నోజిగూడలో మహంకాళి అమ్మవారి విగ్రహాల ఊరేగింపు కార్యక్రమం సోమవారం ఘనంగా జరిగింది. గ్రామంలోని మహంకాళమ్మ, ఎర్ర పోచమ్మ అమ్మవార్ల విగ్రహ ప్రతిష్టాపన, ఆలయ ప్రారంభోత్సవ వేడుకలు ఈ నెల 7 తేది వరకు జరుగుతున్నట్లు నిర్వహకులు తెలిపారు. గ్రామంలోని శ్రీ గాయత్రీ ఆలయ ఆవరణలో అమ్మవారి విగ్రహాలకు గణపతి పూజ, పుణ్యాహవాచనం పూజా కార్యక్రమాలు జరిగాయి. అనంతరం అమ్మవారి విగ్రహాలను గాయత్రీ దేవాలయం నుండి లక్ష్మీ నర్సింహ కాలనీ వరకు ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి, వైస్ చైర్మన్ నానావత్ రెడ్యానాయక్, కౌన్సిలర్లు చింతల రాజశేఖర్, నల్లవెల్లి లక్ష్మీ, మాజీ సర్పంచ్‌లు గాంధారి లక్ష్మీనారాయణ, బాలగోని చిన్న నర్సింహులు గౌడ్, నాయకులు బోయపల్లి సత్తిరెడ్డి, బుచ్చిరెడ్డి, రాధారపు శ్రీశైలం, బోయపల్లి రాజేశ్వర్ రెడ్డి, నల్లవెల్లి మురళి, సంతోశ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్యమే మహాభాగ్యం : ఎంపి రంజిత్ రెడ్డి



ఆస్పత్రిని ప్రారంభిస్తున్న ఎంపి,ఎమ్మెల్యేలు

**శంషాబాద్ ఆగస్టు 1,ప్రభాతవార్త :**
ఆరోగ్యమే మహాభాగ్యం ఆరోగ్యంతో ఉంటే ఎదైనా సాధించవచ్చు అని చెవెళ్ల పార్లమెంట్ సభ్యుడు గడ్డం రంజిత్ రెడ్డి పేర్కొన్నారు.శంషాబాద్ పట్టణంలో కుంభం శ్రీనివాస్ రెడ్డి,సలివేంద్ర వేణుమాధవ్ రెడ్డి,కొలను రామ్ రెడ్డి,డాక్టర్ ప్రవీణ్ రెడ్డి,యాజమాన్యం కలిసి ఏర్పాటు చేసిన సన్ రైజ్ ఆస్పత్రి ప్రారంభోత్సవం సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ,షాద్ నగర్ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌లతో కలిసి ఆయన ప్రసంగించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాగలిగితే వారికి అంతకన్నా మనం ఇచ్చే బహుమతి ఉండాలని పేర్కొన్నారు.విద్య వైద్యం సక్రమంగా అందితే ప్రజలు అన్ని రంగాల్లో బాగుపడతారని తద్వారా నగరం నియోజకవర్గంలో జిల్లా రాష్ట్రం తద్వారా దేశం బాగుపడుతుందని గడ్డం రంజిత్ రెడ్డి అన్నారు.ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ... శంషాబాద్ ప్రాంతంలో ఇంత పెద్ద ఆసుపత్రి ప్రారంభించడం ఈ ప్రాంత ప్రజలకు కార్పొరేట్ వైద్యాన్ని అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని పేర్కొన్నారు.శంషాబాద్ ప్రజలు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జడ్పిటిసి నిరటటీ తన్విరాజు,ఎంపిపి జయమ్మ,వైస్ ఎంపిపి నీలం నాయక్,నార్సింగ్ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకటేష్ గౌడ్,మండల టిఆర్ఎస్ అధ్యక్షుడు పొడిగంటి చంద్రారెడ్డి, కౌన్సిలర్లు లావణ్యశ్రీనివాస్ గౌడ్,స్రవంతి శ్రీకాంత్ రెడ్డి,అజయ్ కుమార్, మాజీ సర్పంచ్ గణేష్ గుప్తా,సలివేంద్రి వేణు మాధవరెడ్డి,ఎస్ రామ్‌రెడ్డి, శ్రీకాంత్ యాదవ్,మురళి యాదవ్,కోనమోల్ల శ్రీనివాస్,పెదిరిపాటి ప్రవీణ్ గౌడ్,సునీత దయానంద్,పుష్పలత,బుచ్చిరెడ్డి,కూచిరెడ్డి,శంకర్ రెడ్డి,చక్రధర్ రెడ్డి,జివై ప్రభాకర్,కవితాప్రసాద్,ఆసుపత్రి డాక్టర్లు ప్రవీణ్ రెడ్డి,గౌరి శంకర్,ప్రవీణ్ ,హర్ష,దినేష్,ఉదయ్ కుమార్,తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా నాగుల చవితి

-ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు

**షాద్‌నగర్, ఆగస్టు 1, (ప్రభాతవార్త) :**
షాద్‌నగర్ మున్సిపల్ పరిధిలోని వివిధ ఆలయాల్లో నాగుల చవితిని పురస్కరించుకొని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని నాగదేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం ఉదయం నుంచే పట్టణంలోని వెంకటేశ్వర ఆలయం, వాసవీ మాత దేవాలయం, శివమారుతి దేవాయలం, ఆంజనేయ స్వామి దేవాలయల్లో భక్తులు, మహిళలు పాల్గొని నాగదేవతలకు పాలు పోసి తమ భక్తిశ్రద్దలతో పూజలు నిర్వహించారు. అదేవిధంగా పట్టణ పరిధిలోని 18 వార్డులోని శ్రీనగర్ కాలనీలోని హనుమాన్ దేవాలయ ప్రాంగణంలో పవిత్ర నాగుల చవితి పర్వదినం సందర్భంగా శాస్త్రోక్తంగా నాగ ప్రతిష్ట కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో వేదపండితుల మంత్రోచ్చరణలతో హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో షాద్‌నగర్ మున్సిపల్ ఛైర్మన్ నరేందర్, స్థానిక కౌన్సిలర్ ప్రేమలత యుగంధర్, 24 వ వార్డు కౌన్సిలర్ రేటికల్ నందీశ్వర్, మాజీ కౌన్సిలర్లు యుగంధర్, రేటికల్ మీనానందీశ్వర్, స్థానికులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



హోమంలో వార్డు కౌన్సిలర్ దంపతులు, భక్తులు

# మహేందర్‌రెడ్డిని నమ్ముకుంటే ఆగమాగమే

## -చైర్ ఎలా దిగరో మేమూ చూస్తాం
## -మార్కెట్ కమిటీ చైర్మన్ విఠల్‌నాయక్ ధ్వజం

**ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :**
ఇరవై ఐదు ఏండ్లుగా మహేందర్‌రెడ్డి వెంట పని చేసి ఆగమాగం అయ్యామని, ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి నాయకత్వంలో పని చేయడం వల్ల తమకు న్యాయం జరిగిందని తాండూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విఠల్‌నాయక్ అన్నారు. అధిష్టానం సమక్షంలో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న రాజీనామా చేయాలని, ఆమె మారాం చేస్తే ఎలా దించాలో తమకు తెలుసునని స్పష్టం చేశారు. సోమవారం డాక్టర్ సంపత్ నివాసంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో టీఆర్ఎస్ అధికార ప్రతినిధి రాజూగౌడ్, పట్టణ అధ్యక్షుడు నయీమ్ అఫ్ఫూ, శ్రీనివాసచారీ, భద్రేశ్వర టెంపుల్ చైర్మన్ బంటారం సుధాకర్, మార్కెట్ వైస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్లు పట్లోళ్ల నర్సింహులు, ఇర్ఫాన్, ఎం.శ్రీనివాస్, హరిహరగౌడ్ తదితరులు పాల్గొన్నారు. విఠల్‌నాయక్ మాట్లాడుతూ మహేందర్‌రెడ్డి మనుషులు రోజుకో స్టేట్‌మెంట్ ఇస్తూ అధిష్టానాన్ని ధిక్కరిస్తున్నారని విమర్శించారు. ఇకపై వారి ఆటలు సాగవని అన్నారు. దీపా నర్సింహులును చైర్‌పర్సన్‌గా చేయాలని మంత్రులు తలసాని శ్రీనివా


మాట్లాడుతున్న రోహిత్‌రెడ్డి వర్గం నేతలు.

స్‌యాదవ్, సబితారెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డి సమక్షంలో చేసుకున్న ఒప్పందాన్ని ఉల్లంఘించరాదని స్పష్టం చేశారు. రాజూగౌడ్ మాట్లాడుతూ గతంలో మహేందర్‌రెడ్డి మాట మనిషిగా ఛలామణి అయ్యారని, ఇటీవల ఏం మాయ చేశారోగానీ మాటమీద నిలబడటం లేదని వ్యాఖ్యానించారు. ఎన్నో అవినీతి ఆరోపణలకు పాల్పడిన చైర్‌పర్సన్ స్వప్నను వెనకేసుకు రావద్దని కోరారు. డీజిల్ కుంభకోణం మొదలుకుని శానిటేషన్ కార్మికుల వేతనాల్లో కుమ్మక్కయిన చైర్‌పర్సన్‌ను వెంటనే పదవి నుంచి దించేయాలని స్పష్టం చేశారు. ఇటీవల చైర్‌పర్సన్, కొందరు కౌన్సిలర్లు నోరుపారేసుకోవడం మంచిది కాదన్నారు. రాజీనామా చేసేందుకు మహేందర్‌రెడ్డి ఆదేశాలు అవసరం లేదని, తమ అధిష్టానం కేసీఆర్, కేటీఆర్‌లేనని రాజూగౌడ్ స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమంలో పని చేసిన రోహిత్‌రెడ్డి నాయకత్వంలో తాము పనిచేస్తామని తెలిపారు. నయిమ్ అఫ్ఫూ, శ్రీనివాస్‌చారీ మాట్లాడుతూ గతంలో కోట్రికె విజయలక్ష్మిని ఫిఫ్టీ ఫిఫ్టీ ఒప్పందం కింద రాజీనామా చేయించిన మహేందర్‌రెడ్డి ఇప్పుడు ఎందుకు మాట మార్చుతున్నారని ప్రశ్నించారు. క్రమశిక్షణగల పార్టీలో పనిచేస్తున్నందున తాము ప్రజాస్వామ్య పద్ధతిలో రాజీనామా కోరుతున్నామని, లేకుంటే పరిస్థితి వేరే విధంగా ఉండేదని హెచ్చరించారు. అధిష్టానానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న వారి ఆట ఎలా కట్టించాలో తమకు తెలుసునన్నారు. ఒప్పందం ప్రకారం రాజీనామా చేయకుండా పదవిలో కొనసాగడం సిగ్గుచేటని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.

## పాఠశాల భవనాలు శిథిలావస్థకు గురైన పట్టించుకోరా !
బిజెపి జిల్లా ప్రధానకార్యదర్శి ఉప్పరి రమేష్ కుమార్


మాట్లాడుతున్న రమేష్‌కుమార్

**పెద్దేముల్, ఆగస్టు 1, ప్రభాతవార్త:**
పాఠశాల భవనాలు శిథిలావస్థకు గురైన ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోరా అని బిజెపి జిల్లా ప్రధానకార్యదర్శి ఉప్పరి రమేష్ కుమార్ ప్రశ్నించారు. సోమవారం పెద్దేముల్ మండల కేంద్రంలోని మండల వనరుల కేంద్రంలో తొలిమెట్టు శిక్షణ తరగతులను బిజెపి నాయకులతో కలిసి సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా రమేష్ కుమార్ మాట్లాడుతూ పాఠశాలలు ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్న విద్యార్థులకు యూనిఫాంలు పంపిణీ చేయకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. ప్రభుత్వ పాఠశాలలో మౌళిక వసతులు కల్పించడంతో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఆరోపించారు. పాఠశాల భవనాలు శిథిలావస్థకు గురైన ఉన్నతాధికారులు సందర్శించకపోవడం విడ్డూరమని అన్నారు. ఇప్పటికైన ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించకపోతే పెద్దఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండలపార్టీ అధ్యక్షుడు సందీప్‌కుమార్, ఇంచార్జ్ బంటారం భద్రేశ్వర్, కన్వీనర్ యాదయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ అరెస్టులను ఖండించిన ప్రజాసంఘాల నాయకులు


నిరసన తెలుపుతున్న నాయకులు

**బొంరాస్‌పేట్, ఆగస్టు1 ప్రభాతవార్త ః**
ప్రభుత్వ భూమిలో ఇళ్లులేని స్థానికులకు ఇంటి స్థలాలలకు ఇవ్వాలని బొంరాస్‌పేట్ మండల కేంద్రంలో ప్రజసంఘాల నాయకులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. రంగాపూర్ గ్రామంలో సర్వే నంబర్18లోని ఎనిమిది ఎకరాల 39 గంటల ప్రభుత్వ భూమిలో స్థానికులు సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో గుడిసెలు వెశారు. వారిని పోలీస్‌లు అరెస్టులు లాఠి చార్జ్ చేయాడాని వారు ఖండించారు. గత రెండేళ్లుగా భూమికోసం ఇళ్లస్థలాల కోసం స్థానిక అధికారులకు అనేక విజ్ఞప్తులు చేసిన ఆందోళనలు చేసిన సమస్య పరిష్కారం కావడంలేదన్నారు. స్థలాలకోసంపోరాటం చేస్తున్న వారిని పోలీస్‌స్టేషన్లలో ఉంచారని వారిపై లాఠచార్జీని తీవ్రంగా వ్యతిరేఖిస్తున్నమన్నారు. అరెస్టులు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కుల సంఘాల నాయకులు కోత్తూర్ చంద్రయ్య, బుస్స చంద్రయ్య, శ్రీనివాస్, లక్ష్మి, అరవిర్‌బేగం, రజియాబేగం, తదితరులు పాల్గోన్నారు.

## విద్యార్థులలో దేశభక్తి జాతీయస్ఫూర్తిని నింపాలి
-టిపియుఎస్ రాష్ట్ర బాధ్యులు రాములు


ఎంఆర్‌పి సిబ్బందికి భారతమాత పోటోను అందజేస్తున్న దృశ్యం

**పెద్దేముల్, ఆగస్టు 1, ప్రభాతవార్త:**
విద్యార్థులలో దేశభక్తితో పాటు జాతీయ స్ఫూర్తిని నింపాలని టీపియుఎస్ రాష్ట్ర భాధ్యులు రాములు పేర్కొన్నారు. సోమవారం పెద్దేముల్ మండల కేంద్రంలోని మండల విద్యా వనరుల కేంద్రంలో టిపియుఎస్ రాష్ట్ర పిలుపు మేరకు ఆజాదికా అమృత్ మహోత్సవ కార్యక్రమంలో భాగంగా భారతమాత చిత్రపటానికి పూలమాలలు వేసి పూజించారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో భారతమాత చిత్ర పటం ఉండేలా చూస్తామని అన్నారు. విద్యార్థులలో దేశభక్తిని పెంపొందించెందుకు అవగాహన కార్యాక్రమాలు చేపడుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో టిపియుఎస్ జిల్లా బాధ్యులు ఆనందం, మండల గౌరవ అధ్యక్షులు శాంతప్ప, మండల బాధ్యులు ప్రమోద్, టిపియుఎస్ శాఖ భాధ్యులు లక్ష్మారెడ్డి, మాణిక్‌రావు, జనార్ధన్‌రెడ్డి, మహేష్, సంతోష్, అబ్బయ్య, మణి టీచర్ తదితరులు పాల్గొన్నారు.

## నోటు పుస్తకాలు అందజేయడం అభినందనీయం
- హెచ్ఎం చిన్నికృష్ణ

**పూడూరు, ఆగస్టు 1, ప్రభాతవార్త :**
విద్యార్థులకు హార్ట్‌టూ హెల్ప్ చారిటబుల్ ట్రస్టు హైద్రాబాద్ ఆధ్వర్యంలో నోటు పుస్తకాలు అందజేయడం అభినందనీయమని పాఠశాల ప్రధానోపాధ్యాయులు చిన్నికృష్ణ పేర్కొన్నారు. సోమవారం పూడూరు మండలం పరిధిలోని కడ్మూరు గ్రామ ఉన్నత పాఠశాలలో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులకు హార్ట్‌టూ హెల్ప్ చారిటబుల్ ట్రస్టు హైద్రాబాద్ వారి ఆధ్వర్యంలో నోటు పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలోకూడా ఈట్రస్టు అద్వర్యంలో నోటు పుస్తకాలతో పాటు పదవ తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షా ఫీజులను కట్టారని వివరించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు కో ఆర్డీనేటర్ మూడె రవినాయక్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు మధుసూదన్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.


పూడూరు మండలం కడ్మూరు గ్రామ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేస్తున్న దృశ్యం

# విఆర్‌ఏల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి


పూడూరు మండల విఆర్ఎల సమ్మెలో వంటావార్పు నిర్వహిస్తున్న విఆర్ఎల రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ తదితరులు


వంటవార్పులో పాల్గోన్న విఆర్ఏ సంఘం నాయకులు

### పూడూరు మండలంలో
**పూడూరు, ఆగస్టు 1, ప్రభాతవార్త :** సిఎం కేసీఆర్ అసెంబ్లీలో విఆర్ఎలకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని విఆర్ఎల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. పూడూరు మండల కేంద్రంలో విఆర్ఎల డిమాండ్ల సాధనకు నిర్వహిస్తున్న నిరవదిక సమ్మె సోమవారం వంటా వార్పుతో 8వ రోజురు చేరింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని పలుమార్లు రాష్ట్రప్రభుత్వం దృష్టికి తెచ్చినా ఫలితంలేదని ఆవేధన చెందారు. సిఎం అసెంబ్లీ వేదికగా ప్రకటించిన పేస్కేల్ జీఓతోపాటు అర్హత కల్గిన విఆర్ఎలకు ప్రమోషన్లు, 65 సంవత్సరాలు పైబడిన వారి కుటుంబీకుల వారసులకు ఉద్యోగాలు, పెన్షన్ వసతి, మరణించిన వారి కుటుంబీకులకు కారుణ్య నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విఆర్ఎలు సంతోష్, జంగయ్య, శ్రీనివాస్, లింగం, అనంతయ్య, లవకుమార్, చంద్రయ్య, రాంచంద్రయ్య, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

### పెద్దేముల్ మండలంలో
**పెద్దేముల్, ఆగస్టు 1, ప్రభాతవార్త:** విఆర్ఏల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని బిజెపి జిల్లా ప్రధానకార్యదర్శి ఉప్పరి రమేష్ కుమార్ డిమాండ్ చేశారు. పెద్దేముల్ మండల తహసిల్దార్ కార్యాలయం ముందు విఆర్ఏల చేపట్టిన నిరవధిక సమ్మెకు బిజెపి నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్బంగా రమేష్ కుమార్ మాట్లాడుతూ అసెంబ్లి సాక్షిగా ముఖ్యమంత్రి ప్రకటించిన విఆర్ఏల పేస్కేలు జీవోను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల బిజెపి పార్టీ అధ్యక్షులు సందీప్‌కుమార్, మండల ఇంచార్జ్ భద్రేశ్వర్, ప్రధానకర్యాదర్శి హరీష్ గౌడ్, కొత్తూర్ శేఖర్, యాదిగౌడ్, అశోక్, ప్రదీప్, నరేష్, శ్రీనివాస్, గోపాల్, మండల విఆర్ఏ సంఘం అధ్యక్షుడు రమేష్, ఉపాధ్యాక్షులు వెంకటయ్య, కార్యదర్శి, శ్రీనివాస్, ఉప కార్యదర్శి బాలయ్య, సహకార్యదర్శి సమీర్, జేఏసి కన్వీనర్ జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

### కొడంగల్ మండలంలో
**కొడంగల్, ఆగస్టు1ప్రభాతవార్త ః** రాష్ట్ర విఆర్ఏ జేఏసి పిలుపుమేరకు సోమవారం కొడంగల్ మండల కేంద్రం ముందు వంటవార్పు కార్యక్రమం నిర్వహించడం జరిగింది. కొడంగల్ మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమానికి జిల్లా విఆర్ఏ జేఏసిచైర్మన్ సత్యనారాయణ, జనరల్ సెక్రెటరీ చంద్రయ్య, డిప్యూటీ తహసీల్దార్, ఎంఆర్ఐలు సంపూర్ణ మద్దతు తెలపడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో విఆర్ఏలు పాల్గోన్నారు.

## పర్యవేక్షణా లోపంతో అధ్వానంగా మారిన గురుకుల పాఠశాలలు
-తాండూరు నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ నాయకుల ఆరోపణ


హాస్టల్‌లో ఆహారాన్ని పరిశీలిస్తున్న యూత్ కాంగ్రెస్ నాయకులు

**యాలాల ఆగష్టు1, ప్రభాతవార్త :**
తెలంగాణ సర్కార్‌లో గురుకుల సంక్షేమ హాస్టల్‌లు దయనీయంగా మారాయని తాండూరు నియోజక వర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షలు బోయ అశోక్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వసతి గృహాలునిర్వీర్యమై విద్యార్థులు అవస్థలు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దురదృష్టకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అశోక్ ఆద్వర్యంలో సోమవారం యాలాల మండలంలోని కోకట్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను సందర్శించి వసతులను పరిశీలించారు. ఓ పక్క ప్రభుత్వం పట్టించుకోగపోగా మరో పక్క నిర్వాహాకులు పిల్లల పొట్టలు కొడుతూ నాసిరకం ఆహారాన్ని అందిస్తున్నారని ఆయన ఆరోపించారు. ప్రభుత ఉన్నతాధికారుల నిఘా కొరవడడంతో పరిస్థితి అద్వాన్నంగా మారిందని అశోక్ ఆరోపించారు. సరైన పర్యవేక్షణ లేని కారణంగా ఎంతో ఆశతో, ఉత్సాహంతో హాస్టల్‌లో చేరిన విద్యారులు నాసిరకం అన్నం తింటూ అనారోగ్య పాలవుతున్నారని ఆయన విమర్శించారు. పౌష్టిక ఆహారంమాటెలా ఉన్నా, నిర్వాహకుల కక్కుర్తితో పిల్లలు అర్థాకలితో అలమటిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మండల పరిధిలోని ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ గురుకుల పాఠశాలల్లో తనిఖీలునిర్వహించి పిల్లలకు మంచి పౌష్టికాహారం అందేలా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. అశోక్‌తో పాటు యూత్ కాంగ్రెస్ నాయకులు మోయిన్, కావలి సంతోష్, రాజురెడ్డి, జగదీష్, అంకిత్, అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆయుష్ వైద్య సేవలను ప్రలందరూ సద్వినియోగం చేసుకోవాలి
-అడిషనల్ కలెక్టర్ ప్రతీక్ జైన్


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్ ప్రతీక్ జైన్

**శంషాబాద్ ఆగష్టు 1, ప్రభాతవార్త :** ఆయుష్ వైద్య సేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు. రంగారెడ్డి జిల్లా ఆయుష్ విభాగం జిల్లా ఇన్‌చార్జి డాక్టర్ జయశ్రీ ఆధ్వర్యంలో ఆరోగ్యకరదీపితను ప్రతీక్ జైన్ సోమవారం ఆవిష్కరించారు. ఆరోగ్యం కుటుంబ సంక్షేమంలో భాగమైన ఆయుష్ విభాగం పేద ప్రజలకు వైద్య సేవలు అందించడానికి చేస్తున్న కృషిలో భాగంగా కరపత్రాలను రూపొందించారు. వీటిని ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతి ఇంటికి కరదీపికలు చేరే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం డాక్టర్ జయశ్రీ మాట్లాడుతూ... ఆయుష్ యోగ యునాని ప్రకృతి హోమియోపతి వైద్య విధానం ద్వారా కలిగే ప్రయోజనాలను ఈ కరపత్రాల్లో రూపొందించడం జరిగిందని తెలిపారు. అతి పురాతనమైన ఈ వైద్య విధానం ద్వారా ఎంతో మందికి మేలు జరుగుతున్నదని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రశాంత్, డాక్టర్ నర్మదా తదితరులు పాల్గొన్నారు.

## ఏపీవో 14లక్షలు మింగేశారు : సర్పంచ్

**బషీరాబాద్, ఆగష్టు 1, ప్రభాతవార్త:**
బషీరాబాద్ ఏపీవో 14లక్షలు మింగేశారని మండల పరిధిలోని మాసాన్ పల్లి సర్పంచ్ భీమప్ప సర్వసభ్య సమావేశంలో పేర్కొన్నారు. సోమవారం నాడు బషీరాబాద్ మండల ప్రజాపరిషత్తు కార్యాలయం నందు నిర్వహించిన సాధారణ సర్వసభ్య సమావేశంలో ఏపీవో పద్మారావు పై మాసాన్ పల్లి సర్పంచ్ ఆరోపించారు. గ్రామంలోని డ్వాక్రా మహిళల నిధులు 14 లక్షలు గోల్మాల్ చేశారని దానికి సంబంధించి లెక్కలు చూపడం లేదని సమావేశంలో పేర్కొన్నారు.

## ఎస్సీ వర్గీకరణతోనే ఉప కులాలకు సమాన అవకాశాలు : మల్లికార్జున్


నిరసన దీక్షలో పాల్గొన్న నేతలు.

**తాండూరు, ఆగస్టు 1, ప్రభాతవార్త :**
ఎస్సీ వర్గీకరణ జరిగితేనే ఎస్సీ ఉప కులాలకు సమాన అవకాశాలు దక్కుతాయని ఎంఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ మల్లికార్జున్ మాదిగ అన్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు తాండూరు పట్టణంలోని మండల తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఎంఎస్ఎఫ్ ఆద్వర్యంలో కేంద్రం పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లును వెంటనే ప్రవేశపెట్టాలని డిమాండ్ నిరసన దీక్ష చేపట్టారు. నిరసన దీక్ష సోమవారం 7వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ మల్లికార్జున్ మాదిగ మాట్లాడతూ.. కేంద్రంలోని బిజేపీ ప్రభుత్వం 2014లో ఎన్నికలకు ముందు ప్రధాని నరేంద్రమోడి బిజేపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే 100 రోజులలో ఎస్సీ వర్గీకరణ చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి 8సంవత్సరాలు గడుస్తున్నా పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టకుండా తీవ్రమైన నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. ఎస్సీ వర్గీకరణ జరిగితే ఎస్సీ ఉప కులాలకు విద్య, ఉద్యోగ, ఆర్థిక రాజకీయ రంగాల్లో సమాన అవకాశాలు దక్కుతాయని పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణ చేపట్టక పోవడంతో ఎస్సీ కులాలలో 57 ఉపకులాలు అన్నీ రంగాలలో వెనకబడి పోతున్నాయని ఆవేధన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మాలను నిలబెట్టుకోవాలని, ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లోనే వర్గీకర్ బిల్లు ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ బషీరాబాద్ మండల ఇంచార్జ్ జి.ప్రవీణ్ మాదిగ, నాయకులు శివాజీ రావణ్, ప్రసాద్, ఎమ్మార్పీఎస్ నాయకులు హారిసుదన్, రాములు, చంద్రయ్య, నవీన్, రవి చంద్రా తదితరులు పాల్గొన్నారు.

## ముగ్గురు కానిస్టేబుల్‌ల పరస్పర బదిలీ
-కానిస్టేబుల్‌లను సన్మానించిన ఎస్ఐ రమేష్‌కుమార్


కానిస్టేబుల్‌లకు సన్మానం చేస్తున్న ఎస్ఐ

**దౌల్తాబాద్, ఆగస్టు 1, ప్రభాతవార్త:**
పరస్పర బదిలీల్లో భాగంగా వికారాబాద్ జిల్లా దౌల్లాబాద్ మండల పోలీస్‌స్టేషన్ నుండి సైబరాబాద్ కమిషనరేట్‌కి బదిలీపై వెళ్తున్న కానిస్టేబుల్ గోపాల్, కృష్ణ మరియు ఉమెన్ కానిస్టేబుల్ మీనాక్షి లను దౌల్తాబాద్ ఎస్ఐ రమేష్‌కుమార్ సిబ్బందితో కలిసి గౌరవంగా సన్మానించారు. ఈ సంధర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. దౌల్తాబాద్ పోలీస్‌స్టేషన్ నుండి బదిలీపై వెళ్లిన కానిస్టేబుల్‌లు చేసిన సేవకు, మండల ప్రజలతో మమేకమై అందరితో మంచిపేరు తెచ్చుకుని మండల ప్రజల అభిమానాన్ని కొల్లగొట్టిన వీరి సేవలు మరువలేనివని ఎస్ఐ కొనియాడారు. ఇక్కడే కాకుండా ఎక్కడ ఉద్యోగం చేసినా ఇదేవిధంగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజా సేవలో ముందుండాలని కోరుకుంటూ దౌల్తాబాద్ పోలీస్ సిబ్బంది వీరిని సాగనంపారు.

## ఇసుక అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు
**కొడంగల్, ఆగస్టు1ప్రభాతవార్త ః** ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్న లారీని పోలీస్‌లు సొమవారం నాడు కర్ణాటకలోని యాద్గీర్ నుండి కొడంగల్‌కు వస్తున్న ఎపి24 టీసి 3465 నంబర్ గల లారీ ఎలాంటి వేబిల్లు అనుమతి లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న లారీని పట్టుకున్నారని స్థానిక ఎస్ఐ రవిగౌడ్ తెలిపారు. లారీని సీజ్‌చేసి ఎంఆర్‌వోకు అప్పగించడం జరిగిందని అయన తెలిపారు. వారిపై కేసు నమోదు చేయడం జరిగిందని అయన తెలిపారు. అక్రమంగా ఇసుకను రవాణా చేస్తే కఠినచర్యలు తీసుకుంటామని అయన హెచ్చరించారు.

## కమ్యూనిటీ హాల్స్ ఏర్పాటుకు స్థల పరిశీలన


కమ్యూనిటీ హాల్‌కు స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, తదితరులు

**చౌడపూర్ ఆగస్టు 1, ప్రభాతవార్త :**
మండల పరిధిలోని వివిధ గ్రామాలలో కమ్యూనిటీ హాల్స్ ఏర్పాటుకు ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి, ఎసిడిపి నిధుల ద్వారా రూ.20లక్షల రూపాయలు కేటాయించడం హర్షించదగ్గ విషయమని మండల టిఆర్ఎస్ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి అన్నారు. వారు మాట్లాడుతూ...మండల పరిధిలోని మందిపాల్ గ్రామంలో ఎస్సీ కమ్యూనిటీ హాల్, కన్వన్ కల్వ గ్రామంలో బిసి మరియు ఎస్సీ కమ్యూనిటీ హాల్స్, చాకల్ పల్లిలో యూత్ కమ్యూనిటీ హాల్ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలిస్తున్నామని తెలిపారు. మందిపాల్ గ్రామంలో ఎస్సీ కమ్యూనిటీ హాల్ కోసం మండల టిఆర్ఎస్ నాయకుల ఆధ్వర్యంలో స్థలాన్ని పరిశీలించామని, త్వరలో భనవ నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమంలో ఎమ్మెల్యే మహేష్ రెడ్డి పాల్గొంటారని తెలిపారు. తెలంగాణ పంచాయతీ రాజ్ ఛాంబర్ రాష్ట్ర కార్యదర్శి మందిపల్ వెంకట్ మాట్లాడుతూ...ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి, ఎసిడిపి నిధుల నుండి మందిపల్ మరియు కన్మన్ కల్వ గ్రామాలకు ఎస్సీ కమ్యూనిటీ హాల్స్ కేటాయించినందుకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి రాందాస్ నాయక్, సొసైటీ వైస్ చైర్మన్ నాగరాజు, మండల టిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి నరసింహులు, టిఆర్ఎస్ యువ నాయకులు మఠం రాజశేఖర్, చిలకల శంకర్, చౌడపూర్ మండల అంబేద్కర్ యువజన సంఘాల అధ్యక్షుడు అశోక్, మండల ప్రధాన కార్యదర్శి కుమార్, శివ కుమార్, మొగులయ్య, నరసింహులు, బన్నీ, కుమార్, యువకులు పాల్గొన్నారు.

## అమ్మోరు తల్లీ అందరిని చల్లంగా చూడు
-భక్తిశ్రద్ధలతో భవాని మాతకు బోనాల పూజలు


తాటిగడ్డ తండాలో బోనాల వేడుకల దృశ్యం

**నందిగామ ఆగస్టు 1, ప్రభాతవార్త :** కొలిచే భక్తుల కొరికలు నెరవెర్చే భవాని మాతకు తాటిగడ్డ తండా గిరిజన మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు. బోనాల వేడుకల సందర్భంగా సర్పంచ్ రాజు నాయక్ ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి ఆ సౌకర్యం కల్గకుండా చర్యలు తీసుకున్నారు. తండాలో ఎప్పుడు లేని విధంగా కనివిని ఎరుగని రీతిలో బోనాలను ఊరేగించారు. గిరిజన సంప్రదాయ రీతిలో గిరిజన మహిళలు బోనం ఎత్తి ఆటపాటలతో మొళతాళాల మధ్య, బాణ సంజా కార్యక్రమాల మధ్య, యువకులు టపాకాయలు కాలుస్తూ సంబరాలు జరుపుకున్నారు. ఈ వేడుకల్లో చిన్న, పెద్ద, ముసలీ ముతక, తారతమ్య బేదం లేకుండా సంబరాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బోనాల సంబరాలను ఉద్దేశించి సర్పంచ్ మాట్లాడుతూ...ప్రజలందరికి బోనాల వేడుకలు సిరిసంపధలు, అష్టఐశ్వర్యాలు, ఆయూరారోగ్యాలు ,ప్రసాధించేలా అమ్మవారిని వెడుకున్నారు. ఈ వేడుకలో చాకలిధనిగుట్ట వార్డు సభ్యులు ఎంపిటిసి సభ్యులు, ఎల్‌హెచ్‌సిఎస్ నాయకులు, లంబాడ నాయకులు, నందిగామ ,కొత్తూరు మండలాల నుండి వచ్చిన భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ


చెక్కును అందిస్తున్న మండల అధ్యక్షులు నర్సిములు గౌడ్

**బొంరాస్‌పేట్, ఆగస్టు1ప్రభాతవార్త ః**
తెలంగాణ రాష్ట్ర పిసిసి అధ్యక్షులు ఎంపి ఏ రేవంత్‌రెడ్డి సహకారంతో బొంరాస్‌పేట్ మండల కాంగ్రేస్ పార్టీ నాయకులు మండల అధ్యక్షులు నర్సిములు గౌడ్ ముఖ్యమంత్రి సహయనిధి చెక్కులను పంపిణీ చేశారు. సాలీండాపూర్ గ్రామానికి చెందిన అనంతయ్యకు 26వేలు, తుంకిమెట్ల జోగు రాములుకు 9వేలు, మణిబాయికి 25వేల 5వందలు, రేణుబాయికి 16వేల 5వందలు, జానకంపల్లి శ్రీనివాస్‌కు 22వేల 5వందల రూపాయాల చెక్కులను సోమవారం నాడు అయన అందించారు. ఈ కార్యక్రమంలో రాంచంద్రరెడ్డి, బాల్‌రాజ్‌గౌడ్, దేశ్యానాయక్, నర్సిములు, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

## వర్షంతో నీట మునిగిన బస్టాండ్
- ప్రయాణీకులకు తీవ్ర ఇబ్బందులు


బంట్వారం మండల కేంద్రంలో వర్షం పడటంతో బస్టాండ్ నీరు దీంతో ప్రయాణీకులకు ఇబ్బందులు,

**కోట్‌పల్లి, ఆగస్టు 1, ప్రభాతవార్త :**
ఏడా తేరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు తీవ్ర ఇబ్బందులు పడాల్సీ వస్తుంది. సోమవారం నాడు బంట్వారంమండల కేద్రంలో కురిసిన భారీ వర్షానికి బస్టాండ్ ముందు పూర్తిగా నీరు చేరడంతో చుట్టు నీరు వస్తుండటంతో కుర్చోవలంటే ప్రయాణీకులకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బస్టాండ్ ముందు సీసీ రోడ్డు వేయాలని పలుమార్లు అధికారులకు తెలిపిన పట్టంచుకోవడం లేదని ప్రయాణీకులు మండి పడుతున్నారు. ఏడా తేరపి లేకుండా కురుస్తున్న వర్షాలకుపూర్తిగా నేలమట్టం నీరు చేరుతుందని దీంతో బస్టాండ్ వేళ్ళలంటే నీరులోం చే బస్టాండ్‌కు వేళ్ళావల్సీ వస్తుందని ప్రయాణీకులు అవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి వర్షలు తగ్గిన వెంటనే సీసీ రోడ్డు వేసి నీరు నిల్వాకుండా చూడాలని ప్రయాణీకులు మండల ప్రజలు కోరుతున్నారు,

## సర్పంచ్ డుమ్మా...తండ్రి హాజరు

**బషీరాబాద్, ఆగష్టు 1, ప్రభాతవార్త:**
మండల ప్రజాపరిషత్తు కార్యాలయం నందు సోమవారం నాడు నిర్వహించిన సాధారణ సర్వసభ్య సమావేశానికి రెడ్డి ఘనపూర్ సర్పంచ్ వంశీకృష్ణ గౌడ్ హాజరు కావాల్సి ఉండగా. ఆయన స్థానంలో తన తండ్రి రామకృష్ణ గౌడ్ హా జరు అయ్యారు. సమావేశంలో పాల్గొన్న ఆయనను చూసిన తోటి సర్పంచు లు రామకృష్ణ గౌడ్ పాల్గొనడంపై చర్చించుకోసాగారు. ఈ విషయం తెలు సుకున్న మండల అధికారులు రామకృష్ణ గౌడ్‌ను సమావేశం నుండి బయటికి పంపించారు.

## సీపీఎం నాయకుల అరెస్టు అప్రజాస్వామికం
**కొడంగల్ రూరల్, ఆగస్టు, 1 ప్రభాతవార్త;** సీపీఎం నాయకులు, కార్యకర్తల అరెస్టు అప్రజాస్వామికమని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు బుస్స చంద్రయ్య అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పరిగి మండలం రాంపూర్ గ్రామంలో ప్రభుత్వ భూమిలో ఇళ్లు లేని నిరుపేదలు గుడిసెలు వేసుకుంటుండగా వారికి మద్దతు తెలిపిన పార్టీ నాయకులను పోలీసులు అరెస్టు చేయడం సరైంది కాదన్నారు. ప్రభుత్వ భూమిలో ఇళ్లు నిర్మించుకు నేందుకు వెళితే నిరుపేదలపై పోలీసులతో లాఠీ చార్జీ చేయించడం, సీపీఎం నాయకులను అక్రమంగా అరెస్టులతో కేసులు నమోదు చేయడం తగదన్నారు. పోలీసులు నమోదు చేసిన కేసులను వెంటనే ఎత్తేయాలని డిమాండ్ చేశారు.